తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 86 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 గురువారం 29 - 10 - 2026 వెల రూ. 2 రూ/

తెలంగాణలో ‘ఏఐ సాక్షమ్’

- ప్రభుత్వ సేవల్లో ఏఐ కార్యక్రమం ప్రారంభం
- పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ‘ఏఐ సాక్షమ్’ కార్యక్రమానికి శ్రీకారం
- ‘ఏఐ సాక్షమ్’ కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క
- రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం
- ప్రజల డేటా భద్రతకే అత్యధిక ప్రాధాన్యమని వెల్లడి



హైదరాబాద్ :

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ‘ఏఐ సాక్షమ్’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల - మిగతా 2 లో

తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది



- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం
- మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్
- కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ
- ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న

హైదరాబాద్ :

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. - మిగతా 2 లో



తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- కీలక శాఖలకు కొత్త అధికారులు
- కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించిన ప్రభుత్వం
- పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్
- జీహెచ్ఎంసీ బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు

హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. - మిగతా 2 లో

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను
- విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి
- సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం



హైదరాబాద్ :

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, - మిగతా 2 లో

బ్యాలెట్‌తో ఎన్నికలు జరిగినా ఓటమి తప్పలేదుగా



- మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్
- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం
- ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ

ఢిల్లీ :

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి ‘మోనోకిల్’ ఎమోజీని జతచేశారు.ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక - మిగతా 2 లో

తుపాను పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష



- సెక్రటేరియట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- అర్నబ్ తుపాను పరిస్థితిపై ఆర్టీజీఎస్‌లో సమీక్ష
- కూలిన చెట్లను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశం
- రవాణా వ్యవస్థను తక్షణం పునరుద్ధరించాలని సూచన
- మనమిత్ర యాప్ ద్వారా ఫిర్యాదుల త్వరితగతిన పరిష్కారం

అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయానికి చేరుకుని, ‘అర్నబ్’ తుపాన్ ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. ‘రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ’ (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి సీసీ కెమెరాల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను ఆయన నేరుగా పరిశీలించారు.తుపాను గమనం, ప్రస్తుత పరిస్థితి, క్షేత్రస్థాయిలో - మిగతా 2 లో

స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం.. రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ



- ప్రమాదంలో 64 మంది మృతి
- టోలెడో ప్రావిన్స్‌లోని ఉర్దా స్టేషన్ సమీపంలో ఈ ఘటన
- ప్రమాద సమయంలో రైళ్లలో 544 మంది ప్రయాణికులు
- మాడ్రిడ్-అండలూసియా మార్గంలో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిపివేత
- సహాయక చర్యలు కొనసాగుతున్నాయి

ఢిల్లీ :

స్పెయిన్ టోలెడో ప్రావిన్స్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు - మిగతా 2 లో

శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు



ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించిన అర్నబ్

- నవంబర్ 3 వరకు వర్షాలు
- అర్నబ్ తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించింది
- తీరప్రాంతాల్లో అలల ఉద్ధృతి మీటరు వరకు ఎగసిపడుతున్నాయన్నారు
- గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గరిష్టంగా 150 కిలోమీటర్ల వేగంతో భీకర ఈదురుగాలులు
- నవంబర్ 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- కోస్తాంధ్ర, యానాంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి :

అర్నబ్ తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కదిలిన ఈ తీవ్ర తుపాను తీరం దాటే సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గరిష్టంగా 150 కిలోమీటర్ల వేగంతో భీకర ఈదురుగాలులు వీచాయి. 48 గంటల్లో తుపాను బలహీనపడనుందని ఐఎండీ శాస్త్రవేత్తలు అంచనా వేశారు.కోస్తాంధ్ర-యానాం ప్రాంతాలలో ఈనెల 30 నుంచి నవంబర్ 3 వరకు, తెలంగాణలో ఈనెల 29 నుంచి నవంబర్ 3 వరకు, రాయలసీమ, తమిళనాడు, పుదుచ్చేరి, - మిగతా 2 లో

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా

- కొత్త తేదీలు ప్రకటన
- పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు
- రాష్ట్రంలో జరగనున్న జిల్లా, మండల పరిషత్ ఎన్నికల తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి
- నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 7న కౌంటింగ్ నిర్వహించనున్నారు



అమరావతి :

రాష్ట్రంలో జిల్లా, మండల పరిషత్ ఎన్నికల పోలింగ్‌ను రీషెడ్యూల్ చేశారు. ఈ మేరకు కొత్త తేదీలను ప్రకటించారు. నవంబర్ 3న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు, నవంబర్ 5న జరగాల్సిన కౌంటింగ్‌ను నవంబర్ 7కు రీషెడ్యూల్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఓ ప్రకటన విడుదల చేశారు. మరోవైపు పట్టణ స్థానిక - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
గురువారం 29 - 10 - 2026

సంపాదకీయం

యువకెరటం జయకేతనం!

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ తర్వాత మరో దేశమైన సెర్బియాలో సైతం యువతరం తడాఖా చూపింది. ఆగ్నేయ యూరోప్‌లో డాన్యూబ్, సావా నదుల సంగమస్థలమైన దాని రాజధాని నగరం బెల్‌గ్రేడ్ సోమవారం లక్షలమంది జనంతో ఉప్పొంగిపోయింది. ఒక నాయకుడంటూ లేకుండా, నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించుకోకుండా విద్యార్థులు ఏకమై నెలకొల్పిన స్టూడెంట్ లిస్ట్ పార్టీ 53.3 శాతం ఓట్లతో, 140 స్థానాల్లో జయభేరి మోగించటం ఆ విజయోత్సవానికి కారణం. 250 స్థానాలున్న పార్లమెంటుకు పన్నెండేళ్ల క్రితం అధికారంలోకొచ్చిన ప్రస్తుత అధ్యక్షుడు అలెక్సాండర్ వూచిచ్ ఆ పక్కనున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆదర్శంగా తీసుకుని రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారికి కుదరదు గనుక ప్రధానిగా తిరిగొద్దామని ఎత్తుగడ వేశారు. కానీ తన పొరుగునున్న హంగేరీ అధ్యక్షుడు విక్టర్ ఒర్బాన్‌కు ఏమైందో గమనించుకోలేదు. తన మాదిరే ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా, పారిశ్రామికరంగం వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయించిన ఒర్బాన్ పదహారేళ్ల అనంతరం మొన్న మే నెలలో పదవీచ్యుతుడయ్యారు. దాన్నుంచి వూచిచ్ ఏమీ నేర్చుకోలేదు సరిగదా... అవినీతి భూతాన్ని అదుపు చేద్దామన్న స్పృహ కూడా కొరవడింది.శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో యువతరం హింసామార్గానికి మళ్లింది. అధికార సౌధాలపై దాడులకు దిగింది. పాలకుల్ని తరిమికొట్టింది. కానీ సెర్బియా యువతరం ఇందుకు భిన్నం. ప్రభుత్వం ఎంత రెచ్చగొట్టినా శాంతియుత మార్గాన్ని వీడలేదు. అందుకే రెండేళ్లనుంచి ఉద్యమం నిలకడగా సాగింది. దాన్ని అణిచేయటానికి వూచిచ్ చేయని ప్రయత్నమంటూ లేదు. తుపాకుల ప్రయోగం మినహా చేయాల్సిందంతా చేశారు. రాత్రి వేళల్లో అరెస్టులు, లాఠీచార్జిలు, పెప్పర్ స్ప్రే ప్రయోగాలు, ఉద్యమవేదికల్ని హఠాత్తుగా నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించటం వగైరాలన్నీ ఉపయోగించారు. మాఫియా ముఠాలను రంగంలోకి దించారు. చురుగ్గా పనిచేసే నేతల్ని బెదిరించటం, దౌర్జన్యానికి దిగటం, ప్రధాన నగరాల్లో ప్రభుత్వ భవనాల దరిదాపుల్లోకొచ్చే యువకుల్ని బెదర గొట్టడం, ఇళ్లకు వెళ్లి చంపేస్తామని బెదిరించటం ఈ ముఠాల పని. ఉద్యమ నేతలను విదేశీ శక్తుల కిరాయిమనుషులుగా అనుకూల మీడియా సాగించిన ప్రచారం... ఉద్యమ కారుల బంధుమిత్ర గణం ద్వారా జనానికి చేరే సమాచారం ముందు వీగిపోయింది. విద్యార్థులు స్టూడెంట్ లిస్ట్ నేతలుగా వెలిగిపోవాలనుకోలేదు. నిజానికి 250 మంది జాబితాలో ఒక్క విద్యార్థి కూడా లేడు. రైతుల్ని, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లను, నటుల్ని, ఒపేరా గాయకుల్ని, క్రీడాకారుల్ని, వైద్యరంగ నిపుణుల్ని అభ్యర్థులుగా ఎంపిక చేసు కున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పార్టీ నెలకొల్పాలా వద్దా అని ఊగిసలాడినా చివరకు వివిధ నగరాలు, పట్టణాల్లోని కూడళ్లలో తరచు చర్చావేదికలు నిర్వహిస్తూ వచ్చారు. అక్కడే విధానాలు ఖరారయ్యేవి. ఆ విధానాలే ఇప్పుడు విజయాన్నిచ్చాయి. అయితే వూచిచ్ ఇంత త్వరగా పదవినుంచి తప్పుకుంటారని వారనుకోలేదు. బహుశా ఇదే బెల్‌గ్రేడ్‌లో 1903లో తన పేరేగల రాజుపై సైన్యం తిరుగుబాటుచేసి ఆయన్ని కిటికీ నుంచి విసిరేయడం గుర్తొచ్చి ఉండాలి. సైన్యం బలంతో అధికారానికి అంటిపెట్టుకుంటే కష్టాలు చవిచూడాల్సి వస్తుందని వూచిచ్ సరిగానే అంచనా వేసుకున్నారు.ఇంతకూ ఓడింది బ్రెజిల్‌లో మాదిరే మితవాద, జాతీయవాద పక్షమైనా... నెగ్గిందెవరో చెప్పటం అంత సులభం కాదు. వారు ఉదారవాదులనీ, అమెరికా డీప్ స్టేట్ ఏజెంట్లనీ వూచిచ్ ప్రచారం చేశారు. అటు ట్రంప్‌కు సైతం అలాంటి ఆశ ఉంది. బెల్‌గ్రేడ్‌లో ట్రంప్ టవర్‌కు వూచిచ్ అనుమతించకపోవడం ఆయనకు ఆగ్రహం కలిగించింది. కానీ స్టూడెంట్ లిస్ట్ అంత తేలిగ్గా అమెరికాను అక్కున చేర్చుకునే రకం కాదు. వారు మౌలికంగా ప్రజాస్వామికవాదులు. జాతీయవాదం తమలో ఏం తక్కువలేదని ఉద్యమ సందర్భంలో చాటారు. యూరోప్ యూనియన్(ఈయూ)లో చేరతామంటూనే సెర్బియా రష్యా వైపు మొగ్గడం ఆ సంస్థకు నచ్చలేదు. స్టూడెంట్ లిస్ట్ పార్టీకి ఈయూపై ఆసక్తే లేదు. మొత్తానికి నిలకడగా, సూత్రబద్ధంగా పోరాడి సాధించిన విజయం పాలనలో ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించిన అర్నబ్

మొదటిపేజీ తరువాయి - కారైకాల్‌లలో నేటి నుంచి నవంబర్ 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కృష్ణ, బాపట్ల జిల్లాల్లో గంటకు 110-120 కిలోమీటర్ల వేగంతో గరిష్టంగా 130 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తున్నాయి. సాయంత్రానికి 70నుంచి 80 కిలోమీటర్ల వేగానికి తగ్గి, రాత్రికి 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో శీతల గాలులుగా మారుతాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో అలల ఉద్ధృతి మీటరు వరకు ఎగిసిపడుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా అర్నబ్ తుపాను ఉభయగోదావరి జిల్లాలతో పాటు, ఉత్తరాంధ్రలో బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల తీవ్రతకు పలు చోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిన ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. విశాఖ పాత గోశాల సమీపంలో విద్యుత్తు స్తంభం కూలి మహిళ మృతి చెందగా, విశాఖ బాలాజీనగర్‌లో విద్యుత్ స్తంభం కూలి కె.మాధవి దుర్మరణం చెందారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.బీమవరంలోని చర్చి వద్ద చెట్టు విరిగిపడి చొక్కా కిషోర్ (45) మృతి చెందగా, బొండాడవారివీధిలో విద్యుత్తు స్తంభం విరిగిపడి రాంబాబు (34) మృతి చెందారు. ఈదురుగాలుల ధాటికి భీమవరంలో దుకాణాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రకాష్‌పురంలో వృద్ధురాలు మృతి చెందారు. అదే జిల్లాలో ఈదురుగాలులు, వర్షానికి గుడిసె కూలి కొల్లు వెంకాయమ్మ దుర్మరణం చెందారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో ఈదురుగాలులకు విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఉదయాన్నే ప్రమాదవశాత్తూ ఇంటి ముందు ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మహిళ మృతి చెందారు.

తుపాను పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

మొదటిపేజీ తరువాయి - తీసుకుంటున్న చర్యల గురించి ఆర్టీజీఎస్ అధికారులు ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు. తుపాను కారణంగా పలుచోట్ల చెట్లు కూలిపోయిన నేపథ్యంలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయా అని సీఎం ఆరా తీశారు. జాతీయ రహదారులతో పాటు ఇతర మార్గాల్లో విరిగిపడిన చెట్లను తక్షణమే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.తుపాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రికి తెలిపారు. అదేవిధంగా ప్రజల నుంచి 'మనమిత్ర' యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను సంబంధిత అధికారులకు చేరవేసి, సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు.

బ్యాలెట్‌తో ఎన్నికలు జరిగినా ఓటమి తప్పలేదుగా

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్'



మొదటిపేజీ తరువాయి - వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు.అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా

మొదటిపేజీ తరువాయి -

సంస్థల ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు. యథావిధిగా నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.అయితే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3న పరిషత్ పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే అదే రోజున పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఒకే రోజున పట్టణ స్థానిక సంస్థల కౌంటింగ్, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ రెండూ ఏకకాలంలో నిర్వహిస్తే క్షేత్రస్థాయిలో తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతాయని ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు లోతుగా విశ్లేషించారు. అంతేకాక జిల్లాల్లో తగినంత మంది పోలీస్ బలగాలు, మైక్రో అబ్జర్వర్లు, పోలింగ్ సిబ్బందిని రెండు వేర్వేరు భారీ కార్యక్రమాలకు ఒకే సమయంలో కేటాయించడం కష్టసాధ్యమని గుర్తించారు.ఈ క్రమంలోనే ఎన్నికల నిర్వహణపరంగా తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలు వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) భావించింది. ఈ మేరకు పరిపాలన పరమైన ఇబ్బందులు, భద్రతా సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని తేదీల్లో సవరణ చేస్తున్నట్లు ప్రకటించింది. ఎక్కడా ఎలాంటి లోపాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.జిల్లా, మండల పరిషత్‌లకు సవరించిన తేదీ ప్రకారం నవంబర్ 5న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఒకవేళ రీపోలింగ్ అవసరమైతే నవంబర్ 6న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు నవంబర్ 7న ఉండనుంది. మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణ, మావోయిస్టు ప్రభావిత, సమస్యాత్మక ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో మాత్రం పోలింగ్ సమయాన్ని కుదించారు. ఈ ప్రాంతాల్లో చీకటి పడేలోపు పోలింగ్ సిబ్బంది, సామగ్రి సురక్షిత ప్రాంతాలకు చేరేలా నిర్ణీత సమయం కంటే ముందే, అంటే సాయంత్రం మూడు గంటలకే పోలింగ్ ముగియనుంది.ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 10 మండలాల పరిధిలో 44 అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు, పోలవరం జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 44 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించింది. ఈ రెండు జిల్లాల పరిధిలోని 88 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్, రీ-పోలింగ్ ప్రక్రియలు సాయంత్రం మూడు గంటలకే ముగియనుంది. ఈ ప్రాంతాల ఓటర్లు ఈ విషయాన్ని గమనించి, ఎలాంటి గందరగోళానికి గురికాకుండా నిర్ణీత సమయంలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ అమూల్యమైన ఓటు హక్కును వృథా కాకుండా వినియోగించుకోవాలని కోరింది.ఎన్నికల తేదీల్లో తలెత్తిన ఈ సవరణలను అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లు గమనించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి సహకరించాలని ఎస్ఈసీ విజ్ఞప్తి చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును ఉపయోగించుకునేందుకు వీలుగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొంది.

స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం.. రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ

మొదటిపేజీ తరువాయి - హైస్పీడ్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 64 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మూడు బోగీలు పట్టాలు తప్పగా, రెండు బోగీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారుఈ ఘటనపై స్పెయిన్ ప్రధానమంత్రి స్పందించారు.స్పెయిన్ రైల్వే నిర్వహణ సంస్థ ఏడీఐఎఫ్ తెలిపిన వివరాల ప్రకారం, దేశంలోని మధ్య ప్రాంతమైన టొలెడో ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం మాడ్రిడ్ నుంచి నైరుతి ప్రాంతంలోని సెవిల్లెకు వెళ్తున్న రెండు హైస్పీడ్ రైళ్లు ఒకే దిశలో ప్రయాణిస్తున్నాయి. వీటిలో ఒక రైలు ఆగి ఉండగా, వెనుక నుంచి వచ్చిన మరో రైలు దాని వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఢీకొన్న తీవ్రతకు ఓ బోగీ పూర్తిగా ధ్వంసమై, దాని విడిభాగాలు సమీపంలోని వాలులో చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. రెండు రైళ్లలో కలిపి 500 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మూడు బోగీలు చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా మూడు హెలికాప్టర్లు, రెండు మొబైల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లను ఘటనా స్థలినికి పంపినట్లు ఓ అధికారి వెల్లడించారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు స్పోర్ట్స్ పెవిలియన్‌ను సిద్ధం చేశామని ఉర్డా మేయర్ తెలిపారు.ఈ ప్రమాదంతో మాడ్రిడ్ -అండలూసియా మధ్య రైళ్ల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రయాణికులకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐఆర్‌వో సంస్థ కూడా తన భద్రతా ప్రోటోకాల్‌లను అమల్లోకి తెచ్చి, అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన రైళ్లలో ఒకటి ప్రభుత్వ రంగ సంస్థ రెన్ఫేకు చెందినది కాగా, మరొకటి ప్రైవేటు సంస్థ ఐఆర్‌వోకు చెందినది. రెన్ఫే రైలులో 397 మంది, ఐఆర్‌వో రైలులో 147 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.స్పెయిన్ ఆరోగ్యశాఖ మంత్రి మోనికా గార్సియా తెలిపిన వివరాల ప్రకారం, అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న రెండు బోగీల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడంపై సహాయక బృందాలు దృష్టి సారించాయి. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఢీకొన్న వేగం, తీవ్రతను బట్టి చూస్తే ఇది పెను విషాదంగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, అత్యవసర సేవల బృందాలతో పాటు సైనిక అత్యవసర విభాగాన్ని కూడా ప్రమాద స్థలానికి పంపించారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు ఉర్డా పట్టణంలోని క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు.ఈ ఘటనపై స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై దృష్టి సారించేందుకు తన అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. బాధితులకు సహాయం అందించేందుకు అత్యవసర నిబ్బంది సంఘటనా స్థలంలో పనిచేస్తున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. కాట్టిల్లా-లా మాంచా ప్రాంత అధ్యక్షుడు ఎమిలియానో గార్సియా-పేజ్ కూడా ప్రమాద స్థలానికి బయలుదేరినట్లు వెల్లడించారు.స్పెయిన్‌లో ఈ ఏడాది జరిగిన రెండో పెద్ద రైలు ప్రమాదం ఇది. జనవరిలో దక్షిణ స్పెయిన్‌లో రైలు పట్టాలు తప్పి ఎదురుగా వస్తున్న మరో రైలును ఢీకొన్న ఘటనలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. 2013లో జరిగిన రైలు ప్రమాదంలో 80 మంది మృతి చెందగా, ఆ తర్వాత దేశంలో అత్యంత ప్రాణాంతకమైన రైలు ప్రమాదాల్లో జనవరి ఘటన ఒకటిగా నిలిచింది. తాజా ప్రమాదంతో స్పెయిన్ హైస్పీడ్ రైలు వ్యవస్థ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు.ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు.ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

మొదటిపేజీ తరువాయి - ఈ మేరకు పలువురు అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐపీఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు.ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు శైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు.మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీరెడ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు.

శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

మొదటిపేజీ తరువాయి - భారత్, జపాన్ మధ్య రక్షణ సంబంధాలు మరింత బలపడుతున్నాయి. తమ సైన్యానికి అత్యాధునిక క్షిపణుల వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు భారత్‌లోని శిక్షణా కేంద్రాలను వినియోగించుకోవాలని జపాన్ భావిస్తోంది. ఈ మేరకు తమ సిబ్బందిని చర్చల కోసం భారత్‌కు పంపినట్లు జపాన్ గ్రౌండ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జీఎస్‌డీఎఫ్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మసయోషి అరాయ్ స్వయంగా వెల్లడించారు.సుమారు 1,000 కిలోమీటర్ల పరిధి కలిగిన ఉపరితలం నుంచి నౌకలను ఛేదించే క్షిపణులపై సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం తమకు పెద్ద సవాలుగా మారిందని జనరల్ అరాయ్ తెలిపారు. ఈ నేపథ్యంలో దేశీయంగా, విదేశాల్లో శిక్షణా అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఇందులో భాగంగానే భారత్‌

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
గురువారం 29 - 10 - 2026

ఏలూరులో ఆర్నబ్ తుఫాను బీభత్సం ప్రైవేటు బస్సుపై కూలిన భారీ వృక్షం, డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన పెను ప్రమాదం



ఏలూరు (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : అర్నాబ్ తుఫాను ధాటికి ఏలూరు నగరంలో తీవ్ర రూపం దాల్చిన ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. పలాస నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రతాప్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సుపై ఒక్కసారిగా భారీ వృక్షం కూలిపడింది. ఈ హఠాత్ పరిణామంతో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే, ప్రమాదాన్ని గ్రహించిన బస్సు డ్రైవర్ తక్షణం సమయస్ఫూర్తితో వ్యవహరించి వాహనాన్ని అదుపు చేయడంతో ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 30 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ అప్రమత్తత కారణంగా ప్రయాణికులందరూ ఎటువంటి అపాయం లేకుండా సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన డ్రైవర్‌ను వెంటనే చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మరొక బస్సులో విజయవాడకు పంపించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సర్వీస్, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రహదారికి అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగించి, ఆ ప్రాంతంలో స్తంభించిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

‘అర్నాబ్’ తుఫాన్ వేళ ఏలూరు జిల్లాలో పోలీస్ హై అలర్ట్

రోడ్లపై పడిన చెట్ల తొలగింపు, రవాణా పునరుద్ధరణ



ఏలూరు (తెలుగు కలం) అక్టోబర్ 28 :ప్రతినిధి : ఆర్నబ్ తుఫాను ప్రభావంతో ఏలూరు జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ హై అలర్ట్ ప్రకటించింది. తుఫాన్ ధాటికి జిల్లా వ్యాప్తంగా వీచిన బలమైన ఈదురు గాలుల కారణంగా పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, ప్రజలకు మరియు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సిబ్బంది పూర్తి అప్రమత్తమయ్యారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, కేన్లు మరియు బుల్డోజర్ల సహాయంతో రహదారులపై అడ్డంగా పడిన చెట్లను తక్షణమే తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరించారు. తుఫాను తీరం దాటే సమయంలో భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాకూడదని, పెద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌ల కింద నిలబడకూడదని స్పష్టం చేశారు. అలాగే తెగిపడిన విద్యుత్ తీగలను, రోడ్లపై పడిన చెట్లను ముట్టుకోకుండా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను పాటిస్తూ అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. ఏదైనా ప్రమాదం జరిగినా లేదా అత్యవసర సహాయం కావాలన్నా వెంటనే డయల్ 112 లేదా 95503 51100 నంబర్లకు సమాచారం అందించాలని ఏలూరు జిల్లా పోలీస్ శాఖ ప్రజలను కోరింది.

ముస్తికోవెలాలో పోలీసుల విస్తృత ‘కార్డన్ అండ్ సెర్చ్’ తనిఖీలు





శ్రీ సత్యసాయి జిల్లా (తెలుగు కలం) అక్టోబర్ 28 :ప్రతినిధి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ కార్యకలాపాల అరికట్టడమే లక్ష్యంగా శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు తనిఖీలను తీవ్రతరం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎన్. సతీష్ కుమార్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు బుధవారం సి.కె. పల్లి మండలం ముస్తికోవెల గ్రామంలో పోలీసులు భారీ ఎత్తున ‘కార్డన్ అండ్ సెర్చ్’ ఆపరేషన్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ కె.వి. మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో రామగిరి సీఐ మహమ్మద్ అలీ, ఎస్ఐ సత్యనారాయణతో పాటు స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని సమస్యాత్మక వ్యక్తులు, అనుమానితుల ఇళ్లతో పాటు ప్రధాన ప్రాంతాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా పలు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ కె.వి. మహేష్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని, ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, గొడవలు సృష్టించినా, బెదిరింపులు లేదా అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా బెదిరింపులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక నిఘా, ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం

'గొడ్డలి పార్టీ' పని ఖేల్ ఖతమ్ అంటూ ఎద్దేవా



అమరావతి (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తమను "వెంట్రుక కూడా పీకలేరు" అంటూ వ్యాఖ్యానించినందుకే రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో జగన్‌కు కేవలం 11 సీట్లు ఇచ్చి తగిన గుణపాఠం చెప్పారని ఆమె గుర్తుచేశారు. అంతటి ఘోర పరాభవం ఎదురైనా ఆయన నైజంలో ఎలాంటి మార్పూ రాలేదని ఎద్దేవా చేశారు. ?చొక్కా మడతపెడతానంటూ ప్రజలను, ప్రభుత్వ అధికారులను భయపెట్టాలని చూస్తే తీవ్ర నష్టం వాటిల్లేది వైసీపీ నాయకులకేనని ఆమె హెచ్చరించారు. రాష్ట్రంలో అరాచక రాజకీయాలకు తెరపడిందని, ప్రజలు ఇప్పటికే ఆమోదయోగ్యం కాని నాయకత్వాన్ని తిరస్కరించారని స్పష్టం చేశారు. తీవ్ర విమర్శలతో విరుచుకుపడిన మంత్రి సవిత, రాష్ట్రంలో ఇకపై 'గొడ్డలి పార్టీ' పని పూర్తిగా ఖేల్ ఖతమ్ అయిందని వ్యాఖ్యానించారు.

నార్పల మండలంలో కేబుల్ వైర్ల చోరీ భయాందోళనలో రైతన్నలు



నార్పల (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : అనంతపురం జిల్లా ?నార్పల మండలంలో వరుస దొంగతనాల ఘటనలు స్థానిక రైతాంగాన్ని తీవ్ర కలవరానికి గురిచేస్తున్నాయి. మండల పరిధిలోని నడిమిపల్లి గ్రామంలో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న బోరుబావుల విద్యుత్ కేబుల్ వైర్లను గుర్తుతెలియని దుండగులు కట్ చేసి అపహరించుకెళ్లారు. ముఖ్యంగా నడిమిపల్లి నుండి గూగుడు గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలోని పలు వ్యవసాయ క్షేత్రాలలో ఈ చోరీలు చోటుచేసుకున్నాయి. అర్ధరాత్రి సమయంలో సమయం చూసి దొంగలు కేబుల్ వైర్లను దోచుకెళ్లడంతో నీటి పారుదల నిలిచిపోయి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన భయపడుతున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసుకుంటున్న పంటలకు నీరందించే సమయంలో ఇలాంటి చోరీలు జరగడంపై బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పెరుగుతున్న ఈ కేబుల్ వైర్ల దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, నైట్ పట్రోలింగ్ పెంచి నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

స్థిరమైన భవిష్యత్తు కోసం వినూత్న ఇంజనీరింగ్

తిరుపతి మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు



తిరుపతి (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం, ఏ.రంగంపేట సమీపంలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో అక్టోబర్ 29 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు "స్థిరమైన భవిష్యత్తు కోసం వినూత్న ఇంజనీరింగ్" అనే అంశంపై ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఇంజనీరింగ్ సదస్సు నిర్వహించనున్నారు. ఐఈఈఈ హైదరాబాద్ సెక్షన్ సాంకేతిక సహకారంతో జరగనున్న ఈ సదస్సుకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి.వి. రమణ, రిజిస్ట్రార్ డాక్టర్ కే. సారథి మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో వస్తున్న నూతన మార్పులను సమాజ శ్రేయస్సుకు అనుసంధానించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. మూడు రోజుల పాటు సాగే ఈ అంతర్జాతీయ వేదికపై పునరుత్పాదక శక్తి, స్మార్ట్ మౌలిక వసతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), బిగ్ డేటా, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి అత్యాధునిక సాంకేతికతలపై విస్తృతమైన చర్చలు జరగనున్నాయి. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసే ప్రముఖ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు మరియు పారిశ్రామిక నిపుణులు తమ నూతన పరిశోధనా పత్రాలను పంచుకోనున్నారు. దేశ విదేశాల నుంచి ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరవుతుండటంతో సదస్సును దిగ్విజయం చేయడానికి విశ్వవిద్యాలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వహకులు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డీన్ ఎస్ఓఈ డాక్టర్ బాబు దేవసేనాపతి, జనరల్ ఛైర్ హెడ్ మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈఈఈ డాక్టర్ ఎం. ఎస్. సుజాత, ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ డాక్టర్ బి. హేమంత్ కుమార్, టెక్నికల్ ప్రోగ్రామ్ కమిటీ ఛైర్ డాక్టర్ సురేష్ బాబు దారంతో పాటు పలువురు అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడుమూరు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు



కోడుమూరు (తెలుగు కలం) అక్టోబర్ 28 :ప్రతినిధి : కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను అంబికా స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని ప్రదీప్ అగర్వాల్, కామధేను స్టీల్ ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లు తనుష్ అగర్వాల్, మయాంక్ అగర్వాల్ తదితరులు బుధవారం సందర్శించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ప్రముఖులకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో రాతి కట్టడాలతో ముమ్మరంగా సాగుతున్న నిర్మాణ పనులను వారు చాలా ఆసక్తిగా తిలకించారు. ప్రాచీన సంప్రదాయ శిల్పకళా వైభవాన్ని పునరావృతం చేస్తూ పూర్తి రాతి నిర్మాణంతో రూపుదిద్దుకుంటున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ శైలి, అద్భుతమైన రాతి శిల్పాల ప్రత్యేకత మరియు నిర్మాణ పనుల నాణ్యతపై వారు తీవ్ర సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ ఆలయ నిర్మాణ శైలి అత్యంత మనోహరంగా ఉందని, భవిష్యత్తులో ఇది భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని అందించే దివ్య క్షేత్రంగా నిలుస్తుందని ప్రశంసించారు. ?అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ప్రతినిధులు, నిర్మాణ శైలికి సంబంధించిన పలు సాంకేతిక మరియు సాంప్రదాయ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రాచీన ఆలయ నిర్మాణ సంప్రదాయాలను పునరుద్ధరిస్తూ ఇటువంటి రాతి కట్టడాలతో ఆలయాన్ని పునర్నిర్మించడం ఎంతో అభినందనీయమైన విషయమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి, సభ్యులు ఎద్దుల సూర్య రెడ్డి, ఎద్దుల సత్య రెడ్డితో పాటు ఇతర కమిటీ సభ్యులు పాల్గొని, నిర్మాణానికి సంబంధించిన పూర్తి పురోగతి వివరాలను వారికి సమగ్రంగా వివరించారు. కోడుమూరు పట్టణంలో భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం సుందరమైన రాతి శిల్పాలతో రూపుదిద్దుకుంటుండటం పట్ల స్థానిక భక్తులతో పాటు సందర్శకులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మవరంలో వైయస్ఆర్సీపీ ఎన్నికల ప్రచారం జోరు

32, 33, 34 వార్డులలో బ్రహ్మరథం పట్టిన ప్రజలు



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 28 : ధర్మవరం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వైయస్ఆర్సీపీ అభ్యర్థులు తమ వేగాన్ని పెంచారు. పట్టణ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కాచర్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగుతోంది. బుధవారం పట్టణంలోని 32, 33, 34 వార్డులలో కాచర్ల ఆంజనేయులు విస్తృతంగా పర్యటించి ఇంటింటికీ వెళ్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు రాయపాటి రామకృష్ణ నాయకత్వంలో ఈ మూడు వార్డుల ప్రచార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ ప్రచారంలో 34వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఆర్. లక్ష్మీదేవమ్మ, 33వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి డి. వెంకటరమణమ్మ, 32వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి తిప్పమ్మలు తమ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని కాచర్ల ఆంజనేయులుకి ఘన స్వాగతం పలికారు. వార్డులలో ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ, బ్రహ్మరథం పట్టడంతో ప్రచారంలో ఊపు మరింత పెరిగింది. ఇంటింటి ప్రచారంలో భాగంగా కాచర్ల ఆంజనేయులు స్థానికులతో నేరుగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత వైయస్ఆర్సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన ఆయన, నాటి పాలనకు నేటి పరిస్థితికి ఉన్న తేడాను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. ప్రత్యేకంగా ధర్మవరం చేనేత కార్మికుల సమస్యలపై స్పందిస్తూ, తాను నిరంతరం చేనేత కార్మికులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి పోరాడతానని హామీ ఇచ్చారు. గతంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం అందించిన రూ. 25,000 ఆర్థిక సాయం అర్హులైన ప్రతి నేతన్నకూ అందేలా తాను ప్రత్యక్షంగా కృషి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాయపాటి రామకృష్ణ పర్యవేక్షణలో, ముగ్గురు కౌన్సిలర్ అభ్యర్థుల సమన్వయంతో జరిగిన ఈ విస్తృత ప్రచారానికి ప్రజల నుంచి లభించిన అనూహ్య స్పందన చూస్తుంటే ధర్మవరం మున్సిపాలిటీపై వైయస్ఆర్సీపీ జెండా ఎగరడం తథ్యమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



పాలపాటి దీన్నే ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలతో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



నల్లచెరువు (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా పరిటాల శ్రీరామ్ పోటీకి దిగిన నేపథ్యంలో, ఎన్నికల ప్రచారం శోభాయమానంగా ప్రారం భమైంది. ఈ సందర్భంగా కదిరి నియోజకవర్గ పరిధిలోని నల్లచెరువు మండలంలో వేంచేసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ శ్రీ శ్రీ పాలపాటి దీన్నే ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పాల్గొని స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు. అనంతరం, పరిటాల శ్రీరామ్ విజయసమేతంగా నిలవాలనే ఆకాంక్షతో ఆయన తరపున జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కార్యకర్తలు మరియు పరిటాల కుటుంబ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని ముందుకు నడిపారు.

మానవత్వం చాటుకున్న లోకో పైలట్ అడవి దున్నల కోసం గూడ్స్ రైలు నిలిపివేత!

చంద్రాపూర్ (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా నాగభీడ్ సమీపంలో వన్యప్రాణుల పట్ల రైల్వే సిబ్బంది చూపిన అపారమైన మానవత్వం అందరి హృదయాలను ఆకట్టుకుంటోంది. పట్టాలపైకి అకస్మాత్తుగా వచ్చిన అడవి దున్నల గుంపును గమనించిన ఓ లోకో పైలట్, తన సమయస్ఫూర్తితో పెద్ద ప్రమాదాన్ని తప్పించి ఆ మూగజీవాల ప్రాణాలను కాపాడారు. రైల్వే ట్రాక్‌పైకి హఠాత్తుగా అడవి దున్నల గుంపు రావడాన్ని గమనించిన గూడ్స్ రైలు లోకో పైలట్ పప్పు శర్మ వెంటనే అప్రమత్తమయ్యారు. ఎటువంటి ఆలస్యం చేయకుండా అత్యవసర బ్రేకులు వేసి రైలును అక్కడే నిలిపివేశారు. మూగజీవులకు ఎలాంటి హాని జరగకుండా పూర్తి జాగ్రత్త వహిస్తూ, దున్నల గుంపు సురక్షితంగా పట్టాలు దాటి అడవిలోకి వెళ్లేవరకు ఓపికగా ఎదురుచూశారు. ఆ జంతువులన్నీ ట్రాక్ దాటి వెళ్లిన తర్వాతే ఆయన రైలును ముందుకు కదిలించారు. ?ఈ సత్కార్యాన్ని లోకో పైలట్ పప్పు శర్మ తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించగా, సదరు దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. వేగంగా వెళ్తున్న రైలును సరైన సమయంలో ఆపి వన్యప్రాణులను కాపాడిన ఆయన సమయస్ఫూర్తిని, జంతువుల పట్ల చూపిన ప్రేమను నెటిజన్లు విశేషంగా ప్రశంసిస్తున్నారు. మూగజీవాల భద్రతకు ప్రాధాన్యమిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం సహోద్యోగులకు, సమాజానికి ఆదర్శంగా నిలిచింది.

కేంద్ర కరువు బృందం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలి డిఆర్ఓ ఏ. మలోల





అనంతపురం(తెలుగు కలం) అక్టోబర్ 28 : రాబోయే నవంబర్ 1, 2వ తేదీల్లో అనంతపురం జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటించనుంది. ఈ నేపథ్యంలో బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని డిఆర్ఓ ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో డిఆర్ఓ ఏ. మలోల ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. కరువు బృందం పర్యటన అత్యంత ముఖ్యమైనదని, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. కేంద్ర కరువు బృందం నవంబర్ 1వ తేదీన అనంతపురం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, 2వ తేదీన జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తుందని డిఆర్ఓ తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి నిమిషాల వారీ ప్రోగ్రామ్ సిద్ధం చేయడంతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. పర్యటన సందర్భంగా పోలీస్ శాఖ తగిన సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాలని, జిల్లాకు సంబంధించిన పూర్తి కరువు నివేదికలు మరియు గణాంకాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఖరీఫ్ 2026-27 సీజన్ లో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు స్పష్టంగా ప్రతిబింబించేలా ప్రత్యేక ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేయాలని డిఆర్ఓ సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఆర్డబ్ల్యూఎస్ , ఐసీడీఎస్ , పోలీస్ తదితర శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, వెంకట నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. శ్రీనివాసులు, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, ఏపీఎంఐపీ ఏపీడి చంద్రశేఖర్ లతో పాటు డ్వామా, ఐసీడీఎస్, సిరికల్చర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైదుకూరులో స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, జిల్లా ఎస్పీ



మైదుకూరు(తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : వైఎస్ఆర్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అత్యున్నత పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి మైదుకూరు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు మరియు ఓట్ల లెక్కింపు కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరిశీలన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రాల్లో కల్పించిన భద్రతా ఏర్పాట్లు, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు మరియు సిబ్బందికి లభ్యమయ్యే మౌలిక వసతులపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను అక్షరాలా పాటిస్తూ, లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా స్ట్రాంగ్ రూముల వద్ద వీలైనంత కట్టుదిట్టమైన సెక్యూరిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారితో పాటు బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) చంద్రమోహన్, మైదుకూరు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, అధికారి ఆదిశేషారెడ్డి తదితర ఎన్నికల నిర్వహణ అధికారులు పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల లెక్కింపు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

మైనారిటీ వార్డుల్లో కూటమి అభ్యర్థులను ఘనంగా గెలిపించండి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపు



రాయదుర్గం (తెలుగు కలం) అక్టోబర్ 28 : వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అత్యధిక మెజారిటీ అందించి విజయం చేకూర్చాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముస్లిం మైనార్టీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం రాయదుర్గం పట్టణంలోని మైనార్టీ వార్డుల్లో టిడిపి చైర్మన్ అభ్యర్థి టంకాశాల హనుమంతు తో కలిసి కూటమి అభ్యర్థుల తరఫున ఆయన నాయకులతో కలిసి విస్తృత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, 33వ వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జావిద్, 34వ వార్డులో జనసేన పార్టీ అభ్యర్థి భాష పోటీ చేస్తున్నారని తెలిపారు. వీరు ఇద్దరితో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి టెంకసాల హనుమంతును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్తున్న తమకు ముస్లిం మైనారిటీ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. మైనార్టీ సోదరులు, సోదరీమణులు ఇంత పెద్ద ఎత్తున మద్దతు ప్రకటిస్తుండటం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. తాము ఎక్కడికి వెళ్లినా కూటమికే ఓటు వేసి సంపూర్ణ మద్దతు ఇస్తామని ప్రజలు స్వచ్ఛందంగా హామీ ఇస్తున్నారని, తమపై అంతటి విశ్వాసం చూపుతున్న మైనార్టీలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, నిరుపేద మైనార్టీ కుటుంబాలకు గొప్ప ప్రయోజనం చేకూరుతోందని ఆయన చెప్పారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందుతోందని, అలాగే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరటనిస్తోందని పేర్కొన్నారు. సామాజిక భద్రతా పింఛన్ల కింద అర్హులైన వృద్ధులకు నెలకు నాలుగు వేల రూపాయలు, దివ్యాంగులకు ఆరు వేల రూపాయలు మరియు నిర్దిష్ట దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారికి అర్హతను బట్టి పది వేల నుండి పదిహేను వేల రూపాయల వరకు పింఛన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందన్నారు.?ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో పూర్తి సానుకూలత కనిపిస్తోందని, మైనార్టీ వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులకు మద్దతు రోజురోజుకూ పెరుగుతోందని స్పష్టం చేశారు. ప్రచారంలో లభిస్తున్న ఈ అపూర్వ స్పందనను బట్టి మైనార్టీ వార్డుల్లో కూటమి అభ్యర్థులు తప్పక ఘన విజయం సాధిస్తారనే నమ్మకం తనకు కలుగుతోందన్నారు.?ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణమూర్తి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కరేగౌడ్ర మంజునాథ, చైర్మన్ అభ్యర్థి టంకశాల హనుమంతు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కడ్డీపుడి మహబూబ్ బాషా, షబ్బీర్, అబ్దుల్ గఫర్ తదితర కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలంటే రణరంగం కాదు... ప్రగతికి సరికొత్త మార్గం!

బొమ్మనాహాల్ మండలంలో పోలీసుల 'ఫుట్ పెట్రోలింగ్'

భయం వీడి ఓటేయాలన్న రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ



బొమ్మనాహాల్ (తెలుగు కలం) అక్టోబర్ 28 : "ఎన్నికలనేవి పోరాటాలకి, గొడవలకు వేదిక కాదు... అవి ప్రజాస్వామ్యంలో సుపరిపాలనకు, గ్రామాల అభివృద్ధికి వేసే బలమైన పునాదులు" అని రాయదుర్గం రూరల్ సీఐ కె. వెంకటరమణ స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని ప్రజలు శాంతియుత వాతావరణంలో, ఎలాంటి భయందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే లక్ష్యంతో బొమ్మనాహాల్ మండలం ఉద్దేహాల్ గ్రామంలో పోలీసు యంత్రాంగం బుధవారం కదం తొక్కింది. స్థానిక ఎస్సై నబి రసూల్ మరియు పోలీసు బలగాలతో కలిసి సీఐ గ్రామంలో భారీ ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో సీఐ వెంకటరమణ, ఎస్ఐ నబీ రసూల్ గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో పౌరుడికి లభించిన అమూల్యమైన ఆయుధమని, ఎన్నికల సమయంలో ఎలాంటి ఆశచూపినా, ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ నిష్పాక్షికంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఇదే సమయంలో శాంతిభద్రతల విషయంలో సీఐ ఘాటుగా హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగిస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదని, శాంతియుతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను చెడగొట్టాలని చూసే అల్లరిమూకలపై, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై అత్యంత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పండుగ ముగిసేలా ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ, నేరాల నివారణకు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో ఊపందుకున్న ఎన్డీఏ ప్రచారం

వార్డుల్లో విస్తృతంగా పర్యటించిన హరీష్ బాబు





ధర్మవరం **(తెలుగు కలం) అక్టోబర్ 28 :**ధర్మవరం మున్సిపల్ ఎన్నికల వేళ ఎన్డీఏ కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం రోజురోజుకూ వేగం పుంజుకుంటోంది. కూటమి అభ్యర్థులకు ప్రజల్లో తిరుగులేని మద్దతు లభిస్తోందని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు బుధవారం ధర్మవరం పట్టణంలోని 16వ, 19వ, 21వ, మరియు 33వ వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. బీజేపీ అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఎన్డీఏ కూటమి విజయానికి మద్దతు ఇవ్వాలని హరీష్ బాబు ఓటర్లను కోరారు. ఈ పర్యటనలో 16వ వార్డు బీజేపీ అభ్యర్థి కృష్ణాపురం రజియా బేగం, 33వ వార్డు అభ్యర్థి పూలకుంట్ల సరస్వతి, 21వ వార్డు అభ్యర్థి దాసరి అఖిల, మరియు 19వ వార్డు అభ్యర్థి గుండా పద్మావతిలతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రజలను నేరుగా కలుస్తూ, బీజేపీ అభ్యర్థులను కమలం పువ్వు గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి, వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని హరీష్ బాబు పిలుపునిచ్చారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యమిస్తూ విశ్వసనీయంగా పనిచేసే అభ్యర్థులకే ఓటర్ల ఆశీస్సులు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ధర్మవరం మున్సిపాలిటీ చైర్మన్ పదవికి ఎన్డీఏ కూటమి తరఫున పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పరిశే సుధాకర్‌ను సైకిల్ గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని, అలాగే వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులను కమలం గుర్తుపై గెలిపించి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని ధర్మవరం ప్రజలకు హరీష్ బాబు విజ్ఞప్తి చేశారు.

గుత్తి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా 'ఓపెన్ హౌస్' కార్యక్రమం





గుత్తి (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను (పోలీస్ కమెమోరేషన్ వీక్) పురస్కరించుకుని అనంతపురం జిల్లా గుత్తి పోలీస్ స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధరణి కిషోర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, సురేష్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపించారు. ?ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమానికి గుత్తిలోని మహర్షి దయానంద గురుకులం పాఠశాల విద్యార్థులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. సమాజ రక్షణలో పోలీసులు నిర్వహించే కీలక పాత్రను, వారి బాధ్యతలను విద్యార్థులకు అవగాహన పరిచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలు, ఫింగర్ ప్రింట్ విభాగాలు, రైటర్ రూమ్, షీ టీమ్ సేవలు మరియు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రత్యక్షంగా వివరించారు. అలాగే విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను అధికారులు స్మరించుకుంటూ, వారి సేవలను కొనియాడారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధరణి కిషోర్ మరియు ఎస్సైలు రామకృష్ణ, సురేష్ కుమార్ ఓపికగా నివృత్తి చేశారు. ఈ అనుభవం విద్యార్థులలో చట్టం మరియు పోలీసు వ్యవస్థ పట్ల గౌరవాన్ని పెంపొందించడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, దేశభక్తి భావాలను నింపింది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి రేపే చివరి రోజు

అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ జశ్వంత రావు



అనంతపురము (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : అనంతపురం నగరపాలక సంస్థ రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సదుపాయం ముమ్మరంగా కొనసాగుతోంది. అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో బుధవారం ఒక్కరోజే 277 మంది ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీనితో గడచిన రెండు రోజుల్లో మొత్తం 511 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా అనంతపురము నగరపాలక సంస్థ కమిషనర్ మరియు అదనపు ఎన్నికల అధికారి జశ్వంత రావు గారు మాట్లాడూ, గురువారం (తేదీ 29-10-2026) పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవడానికి చివరి రోజని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు వివిధ విధుల్లో ఉంటూ తమ ఓటు హక్కును వినియోగించుకోని అర్హులైన అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఈ ఫెసిలిటేషన్ కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చింతలమ్మ ఘాట్ రోడ్డులో పటిష్ట భద్రతా చర్యలు

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశం



కొయ్యూరు (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం పరిధిలోని ప్రసిద్ధ చింతలమ్మ ఘాట్ ప్రాంతాన్ని సమన్వయ అధికారుల బృందంతో కలిసి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడి ప్రమాదకరంగా మారిన ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన పిఓ, ప్రయాణికుల భద్రతకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్, ఎస్.హెచ్.ఓ, ఎం.పి.డి.ఓ, నేషనల్ హైవే **(NH-516E)** అధికారులు మరియు ఎస్ డి ఆర్ ఎఫ్ ప్రతినిధులతో ఘాట్ రోడ్డు వద్దే ఒక సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో ఇక్కడ ఎదురైన ఇబ్బందులు, ప్రస్తుత రవాణా పరిస్థితులపై చర్చించిన ఆయన, వర్షాలు మరియు గాలులు తగ్గగానే తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్డు వెంబడి రవాణా భద్రతను పటిష్టం చేసి, ప్రయాణికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న సున్నితమైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇంజనీరింగ్ రక్షణ చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జాతీయ రహదారుల **(NH-516E)** అధికారులకు సూచించారు. దెబ్బతిన్న రోడ్డు మార్గాలను పునరుద్ధరించేందుకు శాఖల మధ్య సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే ట్రాఫిక్ నిలిచిపోకుండా రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల శాఖల అధికారులు పరస్పర అవగాహనతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తేల్చిచెప్పారు. ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమం మరియు సమీక్షా సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారితో పాటు కొయ్యూరు మండల తహశీల్దార్ ప్రసాద్ రావు, స్థానిక రెవెన్యూ అధికారులు మరియు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాను ధాటికి వాలిపోయిన విద్యుత్ స్తంభాలు

కంచిలిలో ముమ్మరంగా పునరుద్ధరణ చర్యలు



కంచిలి (తెలుగు కలం) అక్టోబర్ 28 :ప్రతినిధి : శ్రీకాకుళం జిల్లా కంచిలి సమీపంలో 'అర్నాబ్' తుఫాను బీభత్సం సృష్టించింది. తుఫాను ధాటికి వీచిన ఈదురు గాలుల వలన మండలంలోని కర్తలి గ్రామ సమీపంలో గల అంపురం జంక్షన్ నుంచి ఘాటీ రహదారిలో రాకాసి గెద్ద వద్ద పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రహదారికి ఒకవైపు విద్యుత్ స్తంభాలు వాలిపోవడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి, రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్తంభాలు కూలిపోయిన సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్ మరియు ఇతర సిబ్బందితో పాటు జేసీబీ సహాయంతో వాలిపోయిన స్తంభాలను తొలగించి, తిరిగి కొత్త స్తంభాలను నిలబెట్టే పనులను వేగవంతం చేశారు. ఈ పునరుద్ధరణ పనుల్లో ఐటీడీపీ కంచిలి మండల అధ్యక్షుడు వాసాల రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డితో పాటు కర్తలి గ్రామానికి చెందిన స్థానిక యువత, పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని విద్యుత్ సిబ్బందికి చేదోడువాదోడుగా నిలిచారు. విద్యుత్ లైన్లను పునరుద్ధరించి, గ్రామానికి త్వరలోనే సజావుగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు అధికారులు శ్రమిస్తున్నారు.

తీవ్ర తుఫాను హెచ్చరికలతో ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డును

పరిశీలించిన ఆలయ ఈవో వి.కే. శీనా నాయక్



విజయవాడ (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో (ఇంద్రకీలాద్రి) భక్తుల రక్షణ, భద్రతా చర్యలపై ఆలయ యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. తీరప్రాంతాన్ని వణికిస్తున్న తీవ్ర తుఫాను, రాబోయే భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈవో) వి.కె. శీనా నాయక్ నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు శ్రీమతి రమ, శ్రీ అశోక్ కుమార్ ఇతర సిబ్బందితో కలిసి ఆయన ఘాట్ రోడ్డులోని అత్యంత సున్నితమైన ప్రాంతాలను సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ పరిశీలనలో భాగంగా ఓం టర్నింగ్, ఘాట్ రోడ్డు ప్రధాన మార్గం, టోల్ గేట్ తదితర కీలక ప్రాంతాల్లో వర్షపు నీటి ప్రవాహ పరిస్థితిని అధికారులు అంచనా వేశారు. కొండపై నుంచి వచ్చే నీరు కిందకు సాఫీగా ప్రవహించేలా నిర్మించిన డ్రైనేజీ మార్గాలను పరిశీలించిన ఈవో, ఎక్కడా వ్యర్థాలు అడ్డుపడకుండా తక్షణమే పూడికతీత పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల దసరా ఉత్సవాలకు ముందు కొండచరియలు విరిగిపడిన ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించిన శీనా నాయక్, భారీ వర్షాల వల్ల కొండపై నుండి రాళ్లు జారే అవకాశమున్న సున్నిత ప్రాంతాలలో తగిన రక్షణ చర్యలు (సేఫ్టీ నెట్స్, తాత్కాలిక అవరోధాలు) తక్షణమే ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం కనకదుర్గ నగర్ మార్గంలో భక్తుల రాకపోకలను సమీక్షించిన ఈవో, వర్షం వచ్చినా దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను గాలుల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే వినియోగించేలా అన్ని ప్రాంతాల్లో జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దాంతోపాటు వర్షం, చలి తీవ్రత దృష్ట్యా ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి లోటు లేకుండా నిరంతరాయంగా వేడి వేడి అన్నప్రసాదం అందించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

ధర్మవరం మున్సిపల్ 2వ సాధారణ ఎన్నికలు

ప్రశాంతంగా ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మొత్తం 323 ఓట్లు నమోదు



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : ధర్మవరం మున్సిపాలిటీ 2వ సాధారణ ఎన్నికలలో భాగంగా నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఎన్నికల విధుల్లో నిమగ్నమైన ప్రభుత్వ సిబ్బంది మరియు అధికారుల సౌకర్యార్థం ఈ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అవకాశాన్ని కల్పించారు. రెండు రోజులుగా సాగిన ఈ పోలింగ్ ప్రక్రియలో మొదటి రోజు 288 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, చివరి రోజైన రెండవ రోజున 35 ఓట్లు నమోదయ్యాయి. దీనితో రెండు రోజుల వ్యవధిలో మొత్తం 323 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదైనట్లు ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ఓ ప్రకటనలో అధికారికంగా తెలియజేశారు. ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రశాంత ఎన్నికలకు పోలీసులకు సహకరించాలి..

ఎన్నికల విధులపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన..

పోలీసులకు తోడుగా నిలవాలి: డీఎస్పీ బి. శ్రీనివాసరావు



గుంతకల్లు, (తెలుగు కలం) అక్టోబర్ 28 :రానున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖకు ఎన్‌సీసీ క్యాడెట్లు తమ వంతు సహకారం అందించాలని గుంతకల్లు డీఎస్పీ బి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గుంతకల్లు పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎన్నికల సమయంలో చేపట్టాల్సిన విధులు,పాటించాల్సిన క్రమశిక్షణ, ప్రజలకు అందించాల్సిన సహకారంపై అవగాహన కల్పించారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,ప్రశాంత వాతావరణం నెలకొనేలా క్యాడెట్లు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా స్పందించారు. ఎన్నికలను ప్రశాంతంగా,నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు సహకరిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీధర్,టూటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు, ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, అధ్యాపకులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తిలో జోరుగా సాగుతున్న టీడీపీ ఎన్నికల ప్రచారం



గుత్తి (తెలుగు కలం) అక్టోబర్ 28 :ప్రతినిధి : అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఎన్నికల ప్రచారం బుధవారం నాటికి మరింత వేగం పుంజుకుంది. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే, రాబోయే ఐదేళ్లపాటు వార్డు పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి అబ్దుల్ వహాబ్ వార్డు ప్రజలకు స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమానికి గుత్తి టీడీపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎం.కే. చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అభ్యర్థి అబ్దుల్ వహాబ్‌తో కలిసి ఆయన 10వ వార్డులోని ప్రతీ ఇంటికీ తిరుగుతూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక ఓటర్లను కలిసిన నాయకులు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటోందని, నియోజకవర్గం మరియు వార్డు స్థాయిలలో మరిన్ని అభివృద్ధి పనులు జరగాలంటే సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ విస్తృత ప్రచార కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మరియు వార్డు కౌన్సిలర్ హెచ్.ఎం. రసూల్, కౌన్సిలర్లు చికెన్ సీనా, ఎర్రగుడి రమేష్, కొనకొండ్ల సూరి, పిల్లేలి సుధాకర్, మొహమ్మద్ ఇలియాజ్, ఖలీల్, రమణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు టీడీపీ మైనారిటీ రాష్ట్ర నాయకులు ఎస్.ఎండి. రియాజ్, ఆర్.ఎస్. రాజా, పట్టణ ప్రధాన కార్యదర్శి మారుతి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్ బి, వేణుగోపాల్, ఎస్.ఎం. భాషా, నాగరాజు, డాక్టర్ జావీద్, అతావుల్లా, ఎం. వలి, డిష్ దస్తగిరి, డిష్ ఆది, చితంబరయ్య, బండారు చంద్రశేఖర్, కొలిమి నిజాం, హెచ్.ఎం. జిలాన్, ఖలీల్ తదితరులు భాగస్వాములయ్యారు. అలాగే ఆటో యూనియన్ ప్రతినిధులు మహమ్మద్, కృష్ణారెడ్డి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ మాబు, ఉస్మాన్, షెక్షావలితో పాటు యువ నాయకులు ఎన్. షాషా, షెక్షావలి, బి. షెక్షావలి మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

తాడిమర్రిలో ఎన్నికల ప్రిసైడింగ్,

అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ



తాడిమర్రి (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిషత్ కార్యాలయంలో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ ఆఫీసర్లు **(PO),** అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు **(APO)** బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో విజయ్ శేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈఈ శిక్షణా శిబిరంలో డిప్యూటీ ఎంపీడీవో విజయ్ శేఖర్ నాయుడు, మండల విద్యాధికారి కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్‌లతో పాటు మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరించిన దేవిడ్, నారాయణస్వామి పాల్గొని ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి సజావుగా, పారదర్శకంగా నిర్వహించడానికి ప్రిసైడింగ్ మరియు అసిస్టెంట్ ప్రిసైడ

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి

సీఎం చంద్రబాబు ఆదేశం



తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుపానుపై రాష్ట్ర స్థాయి యంత్రాంగం మొదలుకొని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరితో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. తుపానుపై రాష్ట్ర స్థాయి యంత్రాంగం మొదలుకొని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం జిల్లాల్లో పరిస్థితిని, సహాయక చర్యలను సమీక్షించారు. తుపాను కారణంగా ఎక్కడైనా ప్రాణనష్టం సంభవించిందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని నివేదికలు వచ్చినట్లు అధికారులు వివరించారు. వివిధ జిల్లాల్లో వర్షం తగ్గుముఖం పట్టినా ఈదురుగాలులు వీస్తున్నాయని కలెక్టర్లు తెలిపారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ముఖ్యంగా చిన్న నీటిపారుదల చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, చెరువులు పొంగిపొర్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలతో సమన్వయం చేసుకోవాలని, చెరువులకు వస్తున్న నీటి ప్రవాహాలను గమనిస్తూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు సూచించారు. చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, చెట్లు కూలిన ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను షెల్టర్లలో ఆశ్రయం పొందుతున్న వారిని పరిస్థితులు పూర్తిగా కుదుటపడ్డాకే ఇళ్లకు పంపించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.సహాయక చర్యల్లో అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితి, పునరుద్ధరణ చర్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. తుపాను ప్రభావంతో ఇవాళ, రేపు (బుధ, గురువారాలు) రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, ప్రచండ గాలులు వీస్తున్న నేపథ్యంలో ఎక్కడా ప్రాణనష్టం కూడా జరగకుండా ప్రభుత్వం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ముందస్తు చర్యల వల్ల ఇప్పటివరకు ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం నమోదు కాలేదని అధికారులు సీఎంకు నివేదించారు.ఉత్తరాంధ్ర, కోస్తాను ముంచెత్తిన వర్షాలు : తుపాను ల్యాండ్‌ఫాల్ సమయం లోనూ, ఆ తర్వాతా కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వానలు బీభత్సం సృష్టించాయని అధికారులు సీఎంకి వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నంలో అత్యధికంగా 12 సెంటీమీటర్లు, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో 9 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని తెలిపారు. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఇప్పటివరకు 5 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయిందని కాకినాడలో గంటకు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ ఈదురుగాలులు వీచగా అమలాపురంలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. వర్షం కొద్దిగా తగ్గుముఖం పట్టినా తీర ప్రాంతాల్లో ఈదురుగాలుల తీవ్రత ఇంకా కొనసాగుతూనే ఉందని వివరించారు.తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో వందలాది చెట్లు రహదారులపై విరిగిపడ్డాయని కోనసీమ జిల్లాలో సుమారు 6 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ముందే నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ప్రాంతంలో రహదారులపై పడిన చెట్లను సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారని చెప్పారు.యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టండి : రహదారులపై కూలిన చెట్లను వెంటనే తొలగించి ఎక్కడా రవాణాకు ఆటంకం కలగకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. తుపాను తీవ్రత, గాలుల వేగం తగ్గిన వెంటనే ప్రాధాన్యతా క్రమంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని వర్షాల వల్ల చెరువులు, కాల్వలు పొంగిపొర్లకుండా నీటిపారుదల శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

వర్షంలోనూ వైభవంగా పైడితల్లి సిరిమానోత్సవం లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం



ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, లక్షలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.ఉత్తరాంధ్ర కల్పవల్లి, విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. పూజారి బంటుపల్లి వెంకట్రావు సిరిమాను ఎక్కి ఊరేగింపులో పాల్గొన్నారు. జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉత్తరాంధ్రతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. సిరిమాను రూపంలో దర్శనమిచ్చిన పైడితల్లి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సుమారు 3 లక్షలమందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.మూడుసార్లు పురవీధుల్లో ఊరేగింపు: విజయదశమి అనంతరం వచ్చే తొలి మంగళవారం నిర్వహించే సిరిమానోత్సవం పైడితల్లి జాతరలో ప్రధాన ఘట్టం. అమ్మవారి ప్రతిరూపంగా భావించే సిరిమానుపై ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు సాయంత్రం 4.40 గంటలకు ముగిసింది. ఆలయం నుంచి అమ్మవారి పుట్టినిల్లుగా భావించే కోట వరకు సిరిమాను మూడుసార్లు ఊరేగింది. పాలధార, అంజలి రథం, తెల్ల ఏనుగు, జాలరి వల వాహనాలు ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జై పైడితల్లి నామస్మరణతో విజయనగరం పురవీధులు మార్మోగాయి. రహదారుల ఇరువైపులా, భవనాలపై వేచివున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని జేజేలు పలికారు.అధికారుల పర్యవేక్షణ: వర్షం కారణంగా ఈసారి భక్తుల రాక కొంత తగ్గినా, ఉత్సవ సందడి మాత్రం ఎక్కడా తగ్గలేదు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ వర్షంలోనూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీ పోలీసు బందోబస్తు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. గోవా గవర్నర్, ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, పలువురు ప్రజాప్రతినిధులు ఉత్సవాన్ని తిలకించారు.11 వరకు జాతర వేడుకలు: అక్టోబరు 1న మండల దీక్ష, ఆలయాల వద్ద పందిరిరాట కార్యక్రమాలతో జాతర ప్రారంభమైంది. ఈ నెల 22న అర్ధమండల దీక్ష, 26న తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. సిరిమానోత్సవం ప్రధాన ఘట్టం కాగా, మిగిలిన సంప్రదాయ వేడుకలతోనూ జాతర సందడి కొనసాగుతుంది. నవంబరు 3న తెప్పోత్సవం, 7న కలశజ్యోతి ఊరేగింపు, 10న ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించనున్నారు. నవంబరు 11న చండీహోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలతో జాతర ముగియనుంది. పైడితల్లి అమ్మవారి జాతర భక్తుల విశ్వాసానికి, విజయనగరం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

అనంతపురం వృక్షజాలంపై పుస్తకావిష్కరణ

విశ్వవిద్యాలయ సాంకేతిక సహకారంతో నగరంలో మియావాకి అడవుల పెంపకానికి కలెక్టర్ శ్రీకారం



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 28 : ప్రతినిధి : శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌లో అక్టోబర్ 28న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ 'శ్రీశ్రీశ్రీఓ శీట ూఅఘఖ్ష్ట్రుజూబఖ్ష్ట్రుఎబ



జఖ్ష్ట్రఎ ఘఅఽ ూఅఘఖ ఙ్ఞుఎజూబం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ బి. రవి ప్రసాద్ రావు ఈ గ్రంథాన్ని రచించగా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్‌తో కలిసి కలెక్టర్ దీనిని విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలను అభినందిస్తూ కలెక్టర్‌ను వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ డాక్టర్ ఇ. రమేష్ బాబు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ బి. అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ ఇ. రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మునినారాయణప్ప, ప్రొఫెసర్లు లక్ష్మయ్య, రవీంద్ర, ప్రభాకర్, పీఆర్వో డాక్టర్ బి. సత్యనారాయణ, డాక్టర్ సంధ్యారాణి తదితర అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం జిల్లా కలెక్టర్ విశ్వవిద్యాలయ వృక్షశాస్త్ర ఉద్యానవనాన్ని సందర్శించారు. అక్కడ వృక్షశాస్త్ర విద్యార్థులు, పరిశోధకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఉద్యానవన సంచాలకులు ప్రొఫెసర్ బి. రవి ప్రసాద్ రావు పార్కులోని వివిధ విభాగాలు, థీమ్ గార్డెన్ల ప్రాముఖ్యతను కలెక్టర్‌కు క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా ఉద్యానవనంలో విజయవంతంగా పెంచుతున్న మియావాకి అటవీ నమూనాను పరిశీలించిన కలెక్టర్ దానిపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో ప్రతిపాదిత మియావాకి అడవుల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వాన్ని అందించాలని ప్రొఫెసర్ రవి ప్రసాద్ రావును ఈ సందర్భంగా కోరారు. దాంతో పాటు స్థానిక అడవి మొక్కలు, ఔషధ మొక్కల సంరక్షణ, ప్రాంతీయ జీవవైవిధ్య పెంపుపై కూడా లోతుగా చర్చించారు. అనంతరం సెరికల్చర్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ బి. సత్యనారాయణతో మాట్లాడిన కలెక్టర్, మల్బరీ సాగులో సేంద్రియ పద్ధతుల ప్రాముఖ్యతను, స్థిరమైన పట్టుపురుగుల పెంపకం ద్వారా సాధించగల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగముగా విద్యార్థులతో ముచ్చటించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, వారి భవిష్యత్ లక్ష్యాలు మరియు వృత్తి ప్రణాళికలను తెలుసుకుని తగిన మార్గదర్శకత్వం చేశారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల వేటకే పరిమితం కాకుండా, స్వయం ఉపాధి అవకాశాలను ఒడిసిపట్టుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రాయోగిక నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ లభ్యమయ్యే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ పర్యటన విశ్వవిద్యాలయానికి, జిల్లా యంత్రాంగానికి మధ్య పర్యావరణ పరిరక్షణ, నగర హరితాభివృద్ధి, సుస్థిర వ్యవసాయం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో సహకారాన్ని మరింత బలపరిచింది.

ఉద్యోగి ఆత్మగౌరవమే ముఖ్యం

వెయిటర్‌ను కొట్టిన గెస్ట్‌పై తాజ్ హోటల్ జీవితకాల నిషేధం

ఆగ్రాలోని తాజ్ హోటల్‌లో వెయిటర్‌పై చేయిచేసుకున్న అతిథి

నిందితుడిని జీవితకాలం బ్లాక్‌లిస్ట్ చేసిన హోటల్ యాజమాన్యం

ఉద్యోగం పోతుందనే భయంతో విషయం దాచిపెట్టిన వెయిటర్

ఉద్యోగుల ఆత్మగౌరవమే ముఖ్యమని స్పష్టం చేసిన ఎండీ పరితోష్ లధానీ



ఆగ్రాలోని ప్రఖ్యాత తాజ్ హోటల్‌లో ఓ వెయిటర్‌పై అతిథి చేయిచేసుకున్న ఘటన సంచలనం సృష్టిస్తోంది. ఈ అమానుష ఘటనపై హోటల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. తమ సిబ్బంది ఆత్మగౌరవానికి భంగం కలిగించిన సదరు అతిథిని హోటల్‌లోకి రాకుండా జీవితకాలం నిషేధం (బ్లాక్‌లిస్ట్) విధించింది. ఈ విషయాన్ని హోటల్ ప్రాపర్టీని నిర్వహించే సిన్సియర్ డెవలపర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పరితోష్ లధానీ స్వయంగా ఓ లింక్డిన్ పోస్ట్ ద్వారా వెల్లడించారు.పరితోష్ లధానీ తన పోస్ట్‌లో వివరించిన ప్రకారం.. హోటల్‌లోని రెస్టారెంట్‌లో కాంతీ అనే వెయిటర్ ఒక అతిథికి సర్వీస్ అందిస్తున్నాడు. ఆ సమయంలో కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా ఇద్దరి మధ్య చిన్న అపార్థం చోటుచేసుకుంది. వెయిటర్‌కు ఇంగ్లీషులో పరిజ్ఞానం తక్కువగా ఉండటంతో పొరపాటు జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆ అతిథి, అందరూ చూస్తుండగానే వెయిటర్ కాంతీ చెంపపై కొట్టాడు.అయితే, తనను తీవ్రంగా కలచివేసిన విషయం మరొకటి ఉందని పరితోష్ పేర్కొన్నారు. ఈ ఘటన గురించి వెయిటర్ కాంతీ ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. విషయం తెలుసుకున్న యాజమాన్యం, దీనిపై ఎందుకు మౌనంగా ఉన్నావని ప్రశ్నించగా, కాంతీ చెప్పిన సమాధానం వారిని కదిలించింది. తాను ఆగ్రా సమీపంలోని ఓ పేద రైతు కుటుంబం నుంచి వచ్చానని, తాజ్ హోటల్‌లో పనిచేయడం తన కల అని, దానిని రిస్క్‌లో పెట్టే ఏ పనీ చేయాలనుకోలేదని కాంతీ వివరించాడు. తన ఉద్యోగం పోతుందనే భయంతోనే అవమానాన్ని మౌనంగా భరించినట్లు తెలిపాడు.కాంతీ మాటలు విని తీవ్రంగా చలించిపోయిన పరితోష్, ఆ మరుసటి రోజే ఆ అతిథిని హోటల్ నుంచి జీవితకాలం నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. తన లింక్డిన్ పోస్ట్‌లో ఆయన దీనిపై ఘాటుగా స్పందించారు. "మా తాజ్ ఆగ్రా ప్రాపర్టీ నుంచి ఒక అతిథిని జీవితకాలం బ్లాక్‌లిస్ట్ చేశాను. మా వెయిటర్‌తో వారు ప్రవర్తించిన తీరు భయంకరమైనది. నా బృందంలోని వారిని అగౌరవపరిచే హక్కు ఎవ్వరికీ లేదు. ఇక శారీరకంగా దాడి చేయడాన్ని అస్సలు సహించను" అని ఆయన స్పష్టం చేశారు.కస్టమర్ ఎంత పెద్ద వ్యక్తి అయినా, ఎంత డబ్బు ఖర్చు చేసినా ఉద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తించే హక్కు వారికి లేదని ఆయన స్పష్టం చేశారు. "మన ఉద్యోగులు తమ ఆత్మగౌరవం కోసం నిలబడటానికి భయపడితే, వారి కోసం నిలబడాల్సిన బాధ్యత మనదే!" అని పరితోష్ పేర్కొన్నారు. లింక్డిన్ పోస్ట్ వేలకొద్దీ రియాక్షన్లతో వైరల్‌గా మారింది. హోటల్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తారు. కొందరు నిందితుడిపై అధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించగా, మరికొందరు అతని పేరును ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. మొత్తంమీద కస్టమర్ సంతృప్తి ఎంత ముఖ్యమో, ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమనే బలమైన సందేశాన్ని ఈ ఘటన ఇచ్చింది.

రాయదుర్గం అభివృద్ధి కూటమి తోనే సాధ్యం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో పిలుపు

టిడిపి చైర్మన్ అభ్యర్థి టెంకశాల హనుమంతుకు వ్యాపార వర్గాల మద్దతు కోరిన ఎమ్మెల్యే



రాయదుర్గం (తెలుగు కలం) అక్టోబర్ 28 :రాయదుర్గం పట్టణ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి టెంకశాల హనుమంతుతో పాటు కూటమి ముఖ్య నేతలు, వ్యాపార ప్రముఖులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాయదుర్గం నియోజకవర్గంతో పాటు పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల విస్తరణ, తాగునీటి సరఫరా మరియు వ్యాపార వర్గాలకు అనుకూలమైన పరిపాలన అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు.రాయదుర్గం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఈ అభివృద్ధి ప్రస్థానం మరింత వేగవంతంగా ముందుకు సాగాలంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఎంతైనా అవసరమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాయదుర్గం పట్టణ వ్యాపార ప్రగతికి, శాంతిభద్రతలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.పట్టణ ప్రజలకు, ముఖ్యంగా వ్యాపార వర్గాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసేవే పరమావధిగా పనిచేసే టిడిపి చైర్మన్ అభ్యర్థి టెంకశాల హనుమంతును, అలాగే కూటమి వార్డు అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని వ్యాపార సోదరులను ఎమ్మెల్యే కోరారు. పట్టణ అభివృద్ధికి వ్యాపారులు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తారని, ఈ ఎన్నికల్లో కూడా పూర్తి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు, నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

ధర్మవరం అభివృద్ధికి ఎన్డీఏ అభ్యర్థులను

గెలిపించుకోవాలి పరిటాల శ్రీరామ్



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 28 : శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలోని పట్టుసాలి చేనేతలంతా ఐక్యంగా ముందుకు సాగుతూ, చేనేత వర్గ సంక్షేమానికి కృషి చేయాలని ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. పట్టుసాలి చేనేతల ఐక్యత, పట్టణాభివృద్ధి లక్ష్యంగా స్థానిక సెమీ నారాయణస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన పట్టుసాలి చేనేతల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్‌తో పాటు చేనేత నాయకులు గిర్రాజు నగేష్, కోటం రవిబాబు ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో నాయకులు వస్తుంటారని, పోతుంటారని, అయితే సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకోవాలంటే అందరూ సమైక్యంగా ఉండి ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. చేనేత రంగాభివృద్ధికి, ధర్మవరం సమగ్ర పురోగతికి పట్టుసాలి చేనేతల ఐక్యత ఎంతో కీలకమని స్పష్టం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ధర్మవరం మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున 18వ వార్డు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పల్లెం కృష్ణ విజయానికి పట్టుసాలి చేనేతలంతా కలిసికట్టుగా శ్రమించాలని కోరారు. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకోవడం ద్వారా వార్డు అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. చేనేతల ఐక్యతే బలమని, అందరూ అంకితభావంతో పనిచేస్తేనే వర్గానికి మరింత గుర్తింపు, పురోగతి సాధ్యమవుతాయని నాయకులు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పట్టుసాలి చేనేత సంఘం ప్రతినిధులు, నాయకులు, చేనేత కుటుంబాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

39వ వార్డులో వైసీపీ ఎన్నికల ప్రచార హోరు..

పవన్ కుమార్ గెలుపే లక్ష్యంగా నైరుతి రెడ్డి విస్తృత పర్యటన...!

ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసిన వైసీపీ నాయకులు.. ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని విజ్ఞప్తి





గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 28 :గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 39వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వాల్మీకి పవన్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలనే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వైసీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి ప్రచారంలో పాల్గొని ఓటర్లను నేరుగా కలుసుకుంటూ అభ్యర్థికి మద్దతు కూడగట్టారు.మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రచారంలో నైరుతి రెడ్డి వార్డులోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వాల్మీకి పవన్ కుమార్‌కు తమ ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసీపీ అభ్యర్థి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వైసీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి ఎన్. వెంకటలక్ష్మితో పాటు పార్టీ బలపరిచిన అభ్యర్థులకు కూడా ప్రజలు మద్దతు ఇవ్వాలని నైరుతి రెడ్డి కోరారు. ప్రతి ఓటు ఎంతో కీలకమని, ప్రజల ఆదరణతో పవన్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులన్నీ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.వార్డులోని ప్రతి ఇంటికీ చేరుకుని ఓటర్ల అభిప్రాయాలను తెలుసుకుంటూ, తమ అభ్యర్థికి మద్దతు కోరడంపై వైసీపీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచారాన్ని కొనసాగిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. 39వ వార్డులో పవన్ కుమార్ విజయమే లక్ష్యంగా సాగిన ఈ ఇంటింటి ప్రచారంతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

ఏపీపై 'అర్నబ్' పంజా పలు విమానాలు రద్దు

ఏపీలో అర్నబ్ ప్రభావంతో పలు విమానాలను రద్దు చేశారు. భోగాపురం, విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి పలు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అర్నబ్? అతి తీవ్ర తుపానుగా బలపడింది. గడిచిన 6 గంటల్లో గంటకు 18 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. విశాఖకు 170 కిలోమీటర్లు, కాకినాడకు 140 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 230 కిలోమీటర్లు, బాపట్లకు 300 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. రేపు (బుధవారం) ఉదయంలోపు బాపట్ల-విశాఖ మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఈ సమయంలో ప్రజలు బయటకు రావొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు తుపాను హెచ్చరికతో పాటు రెడ్ అలర్ట్ ప్రకటించారు.ఈ నేపథ్యంలోనే అర్నబ్ తుపాను తీవ్రత దృష్ట్యా భోగాపురం విమానాశ్రయం నుంచి పలు విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. భోగాపురం నుంచి కర్నూలు తిరుపతి, దిల్లీ, హైదరాబాద్, బెంగళూరు, కోల్‌కతా, చెన్నైకి వెళ్లాల్సిన 16 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే 6 విమాన సర్వీసులను ఇవాళ రద్దు చేశారు. బుధవారం కూడా ఇండిగో సంస్థకు చెందిన అన్ని విమాన సర్వీసులను, ఎయిర్ ఇండియా దిల్లీ విమాన సర్వీసు, ఫ్లై91 సంస్థకు చెందిన రెండు హైదరాబాద్ విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.రాజమహేంద్రవరం నుంచి వెళ్లాల్సిన విమానాలన్నీ రద్దు చేశారు. దిల్లీ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయి, వెళ్లాల్సిన ఇండిగో,

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
గురువారం 29 - 10 - 2026

ఇంట్లోనే కూరగాయలు పండించుకోండి.. ఎలాగంటే..

వర్షాకాలం వచ్చింది.. కూరగాయల రేట్లు తగ్గుతాయనుకుంటే.. మార్కెట్ వెళ్లాలంటేనే భయపడుతున్నారు జనాలు. కూరలు కొనలేక... పిల్లలకు పచ్చడి మెతుకులు పెట్టలేక సామాన్య మధ్యతరగతి ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు వానాకాలం వచ్చింది. దేవుడి దయ వలన వర్షాలు కూడా బాగానే పడుతున్నాయి. ఇంట్లో ఏదో మూల చిన్న పాదులు పెట్టుకుంటే మీరే కాదు.. చుట్టుపక్కల వారికి కూడా కూరగాయాలు ఇవ్వవచ్చు. పల్లెల్లోనే కాదు పట్టణాల్లో కూడా చాలా తేలికగా కూరగాయలు పండించవచ్చు. వాసకాలంలో ఇంట్లోనే ఈజీగా పెరిగే కొన్ని కాయగూరలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం.

కాయగూరల రేట్లు చూస్తే కూర కూడ వండుకునే పరిస్థితి లేదు. వంటిట్లో కూరల బుట్ట ఖాళీ.. ఫ్రిజ్ లో పాలు.. పెరుగు తప్ప ఏకూర కనపడం లేదు. జిహ్వ చాపల్యానికి తాళం వేసి మరీ వారంలో ఎక్కువ సార్లు ఉల్లిగడ్డ, ఆలుగడ్డ, కోడిగుడ్డుతో అడ్జెస్ట్ అయితున్నారు. ఎండాకాలం ఇండ్లలో కాయగూరలు పెంచుకోవడం ఎట్లాగు కుదరదు. కానీ, ఇప్పుడు వానాకాలం వచ్చింది. ఇంటి దగ్గర ఏదో కొద్దిగా మూలలో ఏదో విత్తనం నాటితే కాస్తంతా పొట్టనిండా కూడు తినొచ్చు. ఫస్ట్ వాన పడగానే పల్లెల్లో రైతులు పొలాల్లో విత్తనాలు వేస్తారు. ఇక ఇంటిదగ్గర పెరట్లో కట్టె పుల్లతో ఇట్లా అని చిక్కుడు, తోటకూర, బచ్చలి ఇలా ఓపికను బట్టి రకరకాల విత్తనాలు పెడ్తారు. కొన్ని మొక్కలు ఇంటి చుట్టూ తీగలా వచ్చి .. వినాయకచవితి నుంచి దీపావళి, సంక్రాంతి వరకు కూరగాయల మార్కెట్ కు వెళ్లే అవసరం లేకుండా చేస్తాయి. టౌన్ లు, సిటీల్లో ఉన్నవాళ్లు కూడా ఈ కూరగాయలను పండించుకోవచ్చు. . గ్రౌండ్ ఫ్లోర్ లో కాకుండా ఫస్ట్‌ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ ఇలా నివసించేవారు టెర్రస్ మీద, బాల్కనిలో తొట్టిలు, బ్యాగులు పెట్టి పెంచుకునే కాయగూర మొక్కలు కూడా ఉన్నాయి. వీటికి ఎరువులు అక్కర్లేదు.



పురుగుల మందు అవసరం రానే రాదు. వానదేవుడు మోహం చాటేసినప్పుడు కొన్ని నీళ్లుపోస్తే చాలు.. ఎంచక్కా.. ఇంట్లోనే పండిన కూరలను ఆస్వాదించవచ్చు.

దోసకాయ: వానాకాలంలో మంచిగ పండే కాయగూరల్లో దోసకాయ ఒకటి. దోసకాయ విత్తు వేసిన చోట మంచి మట్టి ఉండేటట్టు చూసుకోవాలి. ఎండ బాగ తగిలే ప్లేస్ పెట్టి.. రోజూ కొన్నినీళ్లు పోస్తే చాలు. వీటిని తొట్టెల్లో కూడా పెంచొచ్చు. దోసకాయ ఇత్తులు మార్కెట్ లో తక్కువ ధరకే దొరుకుతాయి. దోసకాయను ఎండబెట్టి...ఈజీగా ఇంట్లోనే విత్తనాలను చేసుకోవచ్చు.

బెండకాయ: మనదేశంలో ఎక్కువ మంది ఇష్టపడే కాయగూరల్లో మొదటిస్థానం బెండకాయదే! అయితే, బెండకాయ పొలాల్లో మాత్రమే పండే కాయగూర అనుకుంటారు చాలామంది. ఈ మాట కేవలం ఎండాకాలానికే సరిపోతుంది. వాసకాలంలో బెండకాయ ఇంటి దగ్గరే హాయిగా పండించుకోవచ్చు. బాల్కనీలో తొట్టెలు పెట్టి అప్పుడప్పుడు నీళ్లు పోస్తే చాలు! గోడ దగ్గరపెడితే ఈ చెట్లు చూసేవాళ్లకు అందంగా కనిపిస్తాయి.

టొమాటో: మన దగ్గర ఎనభై శాతం కూరల్లో కచ్చితంగా టొమాటో ఉండాల్సిందే! వాస్తవానికి ఇది టొమాటోపండు. దీంట్లో సి -విటమిన్ పుష్కలం. మురిగిపోయిన టొమాటోలు పెరట్లో ఏదో ఒక మూలకు పారేస్తేనే.. ఒక్కవాన పడగానే నారు పెరుగుతది. ఈ వానాకాలంలో అన్నిం టికన్నా.. ఈజీగా పెరిగే వాటిలో టొమాటోనే నంబర్ వన్. వీటిని కూడా తొట్టిల్లో పెంచుకోవచ్చు. టొమాటో విత్తనాలు కూడా టొమాటోల్ని ఎండబెట్టి చేసుకోవచ్చు.

ముల్లంగి : ముల్లంగి అంటే తెల్వనోళ్లు చాలామంది ఉంటారు. ఇక, దాన్ని కొత్తగా చూసినవాళ్లు ఇది ఎక్కడ పండిస్తారోనని డౌట్ పడ్తారు. ముల్లంగితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. సలాడ్,సాంబార్లో వేస్తే.. లొట్టలేసుకుని తింటరు. ఇంకా ఎన్నో కూరల్లో ముల్లంగి స్పెషల్? గా వాడతారు. వానాకాలంలో ముల్లంగి ప్రయోగాన్ని ఇంటిపట్టునే చేయొచ్చు. ముల్లంగి విత్తనాలు మార్కెట్ లో దొరుకుతాయి.

తీగలు: ఇంట్లో ఇంచు స్థలం ఉన్న చాలు అక్కడో విత్తనం పడేస్తే.. అవి ఇంటిమీదికి తీగ పారి గంపెడు కాయగూరల్ని ఇస్తాయి.. మీకే కాదు మీరు తిన్నంక మిగిలిన వాటిని పక్కింటోళ్లకు ఇవ్వవచ్చు. అలాంటి వాటిలో బీరకాయ, పొట్లకాయ, ఆనపకాయ, గుమ్మడికాయ, కాకరకాయ చిక్కుడు కాయ ముందు వరసలో ఉంటాయి.

టైంకి వాసలు పడకుంటే.. రోజుకోసారి వాటి మొదళ్ల తడిపితే చాలు! ఇవి ఏ మట్టిలోనైనా పెరుగుతయి. ఎలాంటి ఎరువులూ, కెమికల్స్ వీటికి అవసరం లేదు. వీటిని తొట్టిలో పెట్టికూడా తీగలు ఇంటిపైకి తీగలు పారించుకోవచ్చు.

ప్లాస్టిక్, యూరియా, కల్తీ చక్కెరను కనిపెట్టండిలా

నేటి రోజుల్లో స్వచ్ఛమైన ఆహారం దొరకడం కష్టంగా మారిపోయింది. అధిక లాభాలు పొందాలన్న ఆలోచనతో ఆరోగ్యానికి ఎంతో హాని కలిగించే రసాయనాలు కలిపి ప్రతి ఆహారాన్ని కల్తీ చేసి అమ్మేస్తున్నారు. స్వచ్ఛమైన వస్తువుకు, కల్తీ వస్తువుకు మధ్య తేడాను గుర్తించడం కష్టంగా మారిపోతుంది. అదేవిధంగా, ఈ రోజుల్లో కొంతమంది చక్కెరను కూడా కల్తీ చేసి అమ్ముతున్నారు. పంచదారలో యూరియాను కలిపి అమ్మేస్తున్నారు. వీటితో పాటు చిన్న చిన్న ప్లాస్టిక్ ముక్కలను పొడి చేసి కలుపుతున్నారు. చాక్ పౌడర్, తెల్ల ఇసుక కలిపి కల్తీ చక్కెరను తయారు చేస్తున్నారు. ఈ విషపూరిత చక్కెరను తినడం వల్ల ఎన్నో ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారు. ఇలా కల్తీ అయిన చక్కెరను ఎలా గుర్తించాలో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.



క్యాన్సర్ కారకం...

ఇలాంటి కల్తీ చక్కెర తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై చాలా చెడు ప్రభావం పడుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలా పంచదారను తినడం వల్ల విరేచనాలు, గుండె జబ్బులు, మధుమేహం, అలెర్జీల ప్రమాదాన్ని పెంచుతుంది. ప్లాస్టిక్ చక్కెర తినడం వల్ల క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుంది. అంతేకాకుండా పంచదారలో కలిపిన యూరియా వల్ల కిడ్నీలకు చాలా హానికరం.

ఇలా కనిపెట్టండి...

కల్తీ చక్కెరను గుర్తించడానికి ఎఫ్ఎస్ఎస్ఎఐ కొన్ని సులభమైన మార్గాలను ఇచ్చింది. దీని సహాయంతో మీరు స్వచ్ఛమైన పంచదరాను, కల్తీ చక్కెరను సులభంగా గుర్తించవచ్చు. చక్కెరలో సున్నం లేదా ప్లాస్టిక్ పొడి ఉందో లేదో తనిఖీ చేయడానికి చిన్న పరీక్ష చేయాలి. ఇందుకోసం ఒక గాజు గ్లాసులో నీటిని తీసుకోండి. ఆ నీటిలో ఒక టీస్పూన్ పంచదార వేసి కరిగించాలి. పంచదార నీటిలో బాగా కరిగితే అది స్వచ్ఛంగా ఉంటుంది. అలా కాకుండా నీళ్లలో కొన్ని కణాలు కరగకుండా చిన్నగా కనిపిస్తూ ఉంటే అది కల్తీదని అర్థం. ప్లాస్టిక్ కణాలు కలిస్తే దాని కణాలు నీటి కింది భాగంలో గడ్డకట్టుకుపోవడం కనిపిస్తుంది.

చక్కెరలో యూరియాను కలిపి ఉంటే ఎఫ్ఎస్ఎస్ఏఐ మరో సులభమైన మార్గాన్ని సూచించింది. ఇందుకోసం నీటిలో పంచదారను కలిపి కరిగించాలి. ఆ నీరు అమ్మోనియా వాసన వస్తే అది కల్తీ చక్కెర అని అర్థం. వాసన రాకపోతే పంచదార స్వచ్ఛమైనది అర్థం చేసుకోవాలి.

స్వచ్ఛమైన పంచదారను కూడా అతిగా తింటే సమస్యలు తప్పవు. శరీరానికి అవసరమైనదానికంటే అధికంగా పంచదారను తింటే అధిక నిద్ర వచ్చేస్తుంది. తీవ్ర అలసటగా అనిపిస్తుంది. కొందరిలో మొటిమల సమస్యలు ఎక్కువైపోతాయి. పొట్ట భాగంలో కొవ్వు పెరుగుతుంది. త్వరగా బరువు పెరిగే అవకాశం ఎక్కువ. చక్కెర అధికంగా ఉన్న ఆహారం తినడం వల్ల ఇతర ప్రాణాంతక వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఎక్కువే. కాబట్టి పంచదారను ఎంత తక్కువగా తింటే మంచిది.

జుట్టు ఒత్తుగా పెరగాలంటే
ఈ శ్రీలంక ఆయిల్ వాడాల్సిందే..

మారుతున్న వాతావరణం ఆరోగ్యంతో పాటు జుట్టును కూడా దెబ్బతీస్తుంది. ముఖ్యంగా చెమట ధూళి కారణంగా జుట్టు రాలడం ప్రతి ఒక్కరు ఎదుర్కునే సమస్య. తల దువ్వుతున్నప్పుడు జుట్టు గుప్పిళ్ల కొద్దీ ఊడిపోతూ ఉంటుంది. ఇది చాలామందిలో డిప్రెషన్ కు దారితీస్తుంది. అయితే ఈ సమస్యకు చెక్ పెట్టడానికి చాలా ఉత్పత్తులు వాడి ప్రయోజనం లేక నిరాశ పడుతుంటారు. అలాంటి వారికి మెరుగ్గా ఉపయోగపడేదే శ్రీలంక హెర్బల్ హెయిర్ ఆయిల్. శ్రీలంక ప్రజలు సాంప్రదాయ పద్ధతిలో తయారుచేసే ఈ ఆయిల్ జుట్టు రాలడాన్ని నియంత్రించడమే కాకుండా జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరిగేలా కూడా చేస్తుంది. ఈ నూనెను ఎలా తయారు చేయాలో.. దీనికి కావలసిన పదార్థాలేంటో తెలుసుకుంటే..

జాగ్రత్త.. బొప్పాయిని ఈ ఆహారాలతో కలిపి అసలు తినకూడదు..!

కావలసిన పదార్థాలు.. కొబ్బరినూనె.. 3 కప్పులు,,సన్ ఫ్లవర్ నూనె.. 1 కప్పు,,నువ్వుల నూనె.. 1 కప్పు, ఆలివ్ నూనె.. 1 కప్పు, బృంగరాజ్ పొడి.. 2 టీస్పూన్లు, ఉసిరి పొడి.. 2 టీస్పూన్లు, మందార పువ్వు పొడి.. 1 టీస్పూన్,శీకాకాయ పొడి.. 1 టీస్పూన్, కుంకుడు కాయ పొడి.. 1 టీస్పూన్, గోరింటాకులు.. 1 కప్పు, కరివేపాకులు.. గుప్పెడు

ఈ 5 ఆహారాలు తింటూ ఉంటే చాలు.. పోషకాహార లోపం మిమ్మల్ని టచ్ చేయదు..!

తయారువిధానం..

స్టౌ మీద ఇనుప బాణిలి ఉంచి అందులో పైన చెప్పుకున్న నూనెలను అన్నీ వేసి తక్కువ మంట మీద ఉడికించాలి. నూనె వేడి అయ్యాక అందులో పైన చెప్పుకున్న పొడులు, ఆకులు అన్నీ వేసి సన్నని మంట మీద ఉడికించాలి. ఈ మిశ్రమాన్ని సుమారు 30 నిమిషాలు సన్నని మంట మీద ఉడికించిన తరువాత స్టౌ ఆఫ్ చేయాలి. నూనె చల్లారిన తరువాత ఫిల్టర్ చేసి గాజు సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ నూనెను అలాగే నేరుగా అప్లై చేయవచ్చు. లేదంటే అప్పటికప్పుడు కొద్ది నూనెను వేడి చేసి గోరువెచ్చగా జుట్టుకు పట్టించవచ్చు. ఈ నూనెను సన్నని మంట మీద ఉడికించాలి తప్ప పెద్ద మంట మీద ఉంచకూడదు. దీన్ని కనీసం ఒక నెలరోజుల పాటూ కంటిన్యూగా వాడితే మెరుగైన ఫలితాలు ఉంటాయి.



మొబైల్ ఛార్జింగ్‌లో 80:20 నియమం అంటే ఏమిటో మీకు తెలుసా?



స్మార్ట్‌ఫోన్‌ల యుగంలో జీవితం కూడా స్మార్ట్‌గా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్‌లపై ప్రజల్లో క్రేజ్ పెరుగుతోంది. అన్ని పనులు ఈ ఫోన్ ద్వారానే జరుగుతాయి. ఫోన్‌లో పెరుగుతున్న బిజీ కారణంగా, దానిని ఛార్జ్ చేయడం చాలా ముఖ్యం. ఇది ఛార్జ్ చేయకపోతే మీ స్మార్ట్ ఫోన్ కేవలం బాక్స్‌గా మిగిలిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్మార్ట్‌ఫోన్‌ను ఎలా ఛార్జ్ చేయాలో చాలామందికి తెలియదా? మీరు ఫోన్ బ్యాటరీని సరిగ్గా ఛార్జ్ చేస్తే, అది బ్యాటరీ జీవితాన్ని పెంచుతుంది. దీని కోసం మీరు ఎల్లప్పుడూ 80-20 నియమాన్ని గుర్తుంచుకోవాలి. ఫోన్ బ్యాటరీ చాలా ముఖ్యమైనది. కాలక్రమేణా బ్యాటరీ చెడిపోవడం ప్రారంభిస్తే, ఫోన్ కూడా పాడైపోతుందని అర్థం. అందువల్ల, ఫోన్ ఛార్జింగ్ కోసం కొన్ని నియమాలను అనుసరించడం చాలా ముఖ్యం. తద్వారా ఫోన్ త్వరగా పాడైపోదు.

వాస్తవానికి ఫోన్ బ్యాటరీ 0 శాతానికి చేరుకున్నప్పుడు మాత్రమే ఛార్జ్ చేయాలని చాలా భావిస్తుంటారు. కానీ అది సరైంది కాదంటున్నారు టెక్ నిపుణులు. అదే సమయంలో అది 100 శాతం చేయాలనుకుంటారు. మీరు కూడా ఇలా చేస్తే పొరపాటు చేస్తున్నట్లేనని అంటున్నారు. ఫోన్ బ్యాటరీని పూర్తిగా డిస్చార్జ్ చేయకూడదని లేదా పూర్తిగా ఛార్జ్ చేయకూడదని నిపుణులు అంటున్నారు. ఎప్పుడైనా సరే ఫోన్ ఛార్జింగ్ చేసేటప్పుడు 20:80 నిష్పత్తిని గుర్తుంచుకోవాలంటున్నారు. దీని అర్థం బ్యాటరీ 20 శాతం వద్ద ఉన్నప్పుడు దానిని ఛార్జ్ చేయాలి. అలాగే ఛార్జింగ్ 80 శాతానికి రాగానే డిస్‌ఛార్జ్ చేయాలి. దీనినే 20:80 నిష్పత్తి అంటారు. కొంతమంది నిపుణులు బ్యాటరీని 90 శాతం వరకు ఛార్జ్ చేయవచ్చని చెబుతుంటారు. మీరు ఈ నియమాన్ని పాటిస్తే మీ బ్యాటరీ లైఫ్ పెరుగుతుంది.

ఫోన్‌ను ఛార్జ్‌లో పెట్టి ఉపయోగించడం ప్రారంభించే వారు చాలా మంది ఉన్నారు. ఇది అస్సలు చేయకూడదు. ఫోన్ ప్రాసెసర్‌పై ఒత్తిడి పెంచడమే దీనికి కారణం. ఫోన్‌ను ఛార్జ్ చేస్తున్నప్పుడు, మీరు కంపెనీ నుండి అందుకున్న ఛార్జర్‌ని ఉపయోగించండి. ఇది కాకుండా, మీ ఛార్జర్ దెబ్బతిన్నట్లయితే, మీరు కంపెనీ ఛార్జర్‌ను మాత్రమే కొనుగోలు చేయాలి. కంపెనీ ఛార్జర్ కాకుండా ఇతర ఛార్జర్లను వాడినట్లయితే ఫోన్ త్వరగా పాడైపోయే అవకాశం ఉందంటున్నారు.

పానీపూరీ తింటే క్యాన్సర్ ఖాయం..



కర్ణాటక సర్కార్ కీలక నిర్ణయం!

ఏం తినాలన్నా భయమేస్తోంది.. ఏది తిన్నా క్యాన్సర్ అంటున్నారు.. ఏ పదార్థం గురించి తనిఖీ చేసినా క్యాన్సర్ కారకాలు ఉన్నాయంటున్నారు. ఈ కెమికల్స్, రసాయానాల సంగతి అటు ఉంచితే హోటల్, రెస్టారెంట్ నుంచి ఏం కొనాలన్నా చెమటలు పడుతున్నాయి. ఎందుకంటే చికెన్ బిర్యానీ ఆర్డర్ చేస్తే అందులో బొద్దింకలను కలిపి కీటకాల బిర్యానీ అందిస్తున్నారు. నల్లీ బిర్యానీ ఆర్డర్ చేస్తే బల్లి బిర్యానీ ఇస్తున్నారు. సరే ఈ బిర్యానీలన్ని కాస్త ఖర్చుతో కూడు కున్నవి. డబ్బులు ఉంటే కొను కొవచ్చు లేదంటే



లేదు.. అయితే పేద, మధ్య తరగతి నుంచి ధనికులు వరకు ఎక్కువగా కుమ్మేసే పానీపూరీలను కూడా తినలేని దుస్థితి దాపరించడం దుర్మార్గం. సామాన్యులకు అత్యంత ఇష్టమైన పానీపూరీలోనూ క్యాన్సర్ కారకాలు ఉండడం బాధాకరం!. కర్ణాటకలోని పానీపూరీ షాప్‌లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. పానీపూరీ శాంపిల్స్‌ను పరీక్షించారు. ఈ పరీక్షల్లో షాకింగ్ విషయాలు వెలుగుచూశాయి. కర్ణాటకలో అమ్ముడవుతున్న పానీపూరీలు ఆరోగ్యానికి హానికరమైనవని ఫుడ్ సేఫ్టీ అధికారులు తేల్చారు. సేకరించిన 260 శాంపిల్స్‌లో 41 శాంపిల్స్‌లో ఆర్టిఫిషియల్ కలర్స్, క్యాన్సర్‌కు కారణమయ్యే కార్సినోజెనిక్ ఏజెంట్లను అధికారులు గుర్తించారు. ఇందులో 18 శాంపిల్స్ అయితే అసలు మనుషులు తినడానికి పనికిరావని తేలింది. పానీపూరీ సాస్, స్వీట్ చిల్లీ పౌడర్‌లో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నట్లు అధికారుల తనిఖీల్లో తేలింది. చాలా శాంపిళ్లలో సన్ సెట్ యెల్లో , బ్రిలియంట్ బ్లూ, కార్మోసిన్ రంగులు ఉన్నట్లు గుర్తించారు. ఇక 19 శాంపిళ్లలో సింథటిక్ కలర్స్ ఉన్నాయి. దీంతో కర్ణాటక సర్కార్ సీరియస్ అయ్యింది. పానీపూరీ తయారీలో ఆర్టిఫిషియల్ కలర్స్‌తో తయారు చేసే సాస్‌లు, స్వీట్ చిల్లీ పౌడర్లను రాష్ట్రవ్యాప్తంగా నిషేధించే ఆలోచనలో అక్కడి ప్రభుత్వం ఉంది. నిజానికి కర్ణాటకలో 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫుడ్ సేఫ్టీపై బాగా ఫోకస్ చేసింది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న గోబీ మంచూరియన్‌ను ముందుగా బ్యాన్ చేసింది. ఆ తర్వాత కబాబ్‌లు, చికెన్, చేపలు, శాఖాహార వంటకాలతో సహా వివిధ ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులను ఉపయోగించడాన్ని నిషేధించింది. తెలంగాణ ప్రభుత్వం సైతం ఇటీవల హోటల్స్, రెస్టారెంట్లపై వరుసగా దాడులు నిర్వహిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఫుడ్ కలర్స్ వాడేవారిపై చర్యలు తీసుకుంటుంది. పరిశుభ్రత పాటించని వారిపై సైతం కఠినంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కార్ సైతం ఇలాంటి పదార్థాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే చర్చ సాగుతోంది.

భూమిపై ఏ జీవి కూడా మిగలదు..!



భూమిపై మనుషులు, జంతువులు సహా ఏ ప్రాణి కూడా జీవించదని, భూమి పూర్తిగా నాశనమైపోతుందని శాస్త్రవేత్తలు షాకింగ్ విషయాలు తెలిపారు.ఢిల్లీ మెయిల్ నివేదిక ప్రకారం, బ్రిస్టల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కంప్యూటర్ సిమ్యులేషన్ టెక్నాలజీని ఉపయోగించి ఈ పరిశోధనను చేపట్టారు. ఇందులో మరో 250 మిలియన్ సంవత్సరాల తర్వాత భూమిపై ప్రళయం సంభవించే అవకాశం ఉందని కనుగొన్నారు. శాస్త్రవేత్తల ప్రకారం, భూమి ఉష్ణోగ్రత 70 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంటుంది. ఇలాంటి వాతావరణంలో భూమిపై ఏ జీవి జీవించలేదు. వేడి కారణంగా అన్నీ నశిస్తాయని తెలిపారు.మనం భూమి నుండి కార్బన్‌ను బయటకు పంపే రేటు కారణంగా ఈ విపత్తు త్వరలో సంభవించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. 66 మిలియన్ సంవత్సరాల క్రితం ఇలాంటిదే జరిగిందని, దాని కారణంగా డైనోసార్‌లు చనిపోయాయని తెలిపారు. ఆ సమయంలో ప్రపంచంలో కార్బన్ డయాక్సైడ్ స్థాయి బహుశా ఇప్పుడు ఉన్న దానికంటే రెండింతలు ఎక్కువగా ఉంటుందని పరిశోధనా బృందం అధిపతి అలెగ్జాండర్ ఫార్న్స్‌వర్త్ చెప్పారు. దీని కారణంగా, శరీరం వేడిగా ఉంటుంది. ప్రజలు చనిపోతారు. భూమి మొదట వేడెక్కుతుందని, ఆ తర్వాత పొడిగా ఉంటుందని, చివరకు నివాసస్థలం మారుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతే కాకుండా వేడికి తట్టుకోలేక అగ్నిపర్వతాలు పేలిపోతాయని, భూమి పై చాలా వరకు అగ్నిపర్వతాలతో కప్పబడి ఉంటుందని కూడా చెబుతున్నారు.అలా జరగటం వల్ల అది పెద్ద మొత్తంలో కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తుంది. దీంతో ప్రజలు,జంతువులు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడి క్రమంగా భూమిపై నశిస్తాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

పిల్లలకు పౌష్టిక ఆహారం అదించడం అంటే పెద్ద టాస్కే కదా..



పిల్లలకు పౌష్టిక ఆహారం అదించడం అంటే పెద్ద టాస్కే కదా. వీరికి మంచి ఆహారం అందించాలి. బయట తయారు చేసిన వాటిని పిల్లలకు పెట్టడం మంచిది కాదు. ఎన్నో రకాల పదార్థాలు కల్తీ అవుతున్న ఈ కాలంలో పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. మరి వీరికి పౌష్టికాహారం ఎలా అందించాలి అను కుంటున్నారా? ఇప్పుడు మంచి పోషకాలు కలిగిన ఓ ఆహారం గురించి తెలుసు కుందాం. అదే ఉగ్గు. ఉగ్గులో చాలా పోషకాలు, విటమిన్లు ఉంటాయి. దీన్ని ఆరు నెలల పిల్లలకు మాత్రమే తినిపించాలి. బయట నుంచి తీసుకొని వచ్చే సెర్లాక్ లకు బదులు పిల్లలకు ఉగ్గు అందివవ్వడే ఉత్తమం అంటారు పెద్దలు. ఎందుకంటే ఈ ఉగ్గ ద్వారా పిల్లలకు అన్ని రకాల విటమిన్లు, పోషకాలు అందించవచ్చు. దీన్ని బియ్యం, పప్పులతో తయారుచేస్తారు. మరి మీ పిల్లలకు దీన్ని పెట్టాలి అనుకుంటున్నారా? బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు, శనగపప్పు, బాదం, క్యాష్ నట్స్ . బియ్యం తీసుకున్న దానిలో పావు వంతు ఈ పప్పులు తీసుకోవాలి. బియ్యాన్ని నీళ్లతో శుభ్రంగా కడికి ఫ్యాన్ గాలికి ఆరబెట్టాలి. అలాగే పప్పులను కూడా కడిగి ఎండలో ఎండబెట్టాలి. ఫస్ట్ స్టవ్ ఆన్ చేసి ఒక బౌల్లో వన్ టేబుల్ స్పూన్ నెయ్యి వేసి బియ్యని దొరగా వేయించాలి. వాటిని పక్కకి పెట్టి, పప్పులు కూడా కొంచెం నెయ్యి వేసి దొరగా వేయించుకోవాలి. వేడి చల్లారిన తరువాత వీటిని వేరువేరుగా మెత్తగా పౌడర్ చేసుకోవాలి. ఈ పౌడర్ ని జల్లడ పట్టాలి. అంతే ఉగ్గు పౌడర్ రెడీ అయినట్టే. ఉగ్గు తయారు చేసే విధానం: ఒక గిన్నె లో టీ గ్లాస్ వాటర్ తీసుకొని స్టవ్ ఆన్ చేసి నీటిని బాగా మరగించాలి. మరొక గ్లాస్ లో టేబుల్ స్పూన్ ఉగ్గు పౌడర్ను కొన్ని వాటర్ లో కలిపి ఆ మరిగే నీటిలో పోసి బాగా కలపాలి. లేకపోతే ఉండలు కడుతాయి. మెత్తగా జారుడుగా అవ్వాలి. అప్పుడు ఉగ్గు తయారు అయినట్టూ. చల్లారిన తర్వాత తినిపిస్తే సరిపోతుంది. ఈ ఉగ్గ ఎప్పటికప్పుడు ఫ్రెష్ గా తయారుచేసి పిల్లలకు పెట్టాలి.

అమరావతి నుంచి హైదరాబాద్‌కు కేవలం 3 గంటల్లోనే



తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య వేగ వంతమైన ప్రయాణానికి అడుగులు పడుతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కీలకమైన బీబీనగర్ – నల్లపాడు రెండో రైల్వే లైను ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టు తొలి దశలో భాగంగా ఈ మార్గాల మధ్య రెండో రైల్వే లైన్ నిర్మాణం, విద్యుద్దీకరణ పనులు ప్రారంభ మయ్యాయి. ప్రాజెక్టు పనులు పూర్తి అయితే ఏపీ రాజధాని అమరావతి నుంచి తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు కేవలం మూడు గంటల్లో చేరుకోవచ్చు.ఈ పనులు సకాలంలో పూర్తయ్యితే రెండు రాజధానుల మధ్య సులువుగా రాకపోకలు సాగించవచ్చని రైల్వే అధికారులు చెప్తున్నారు.

జామున్ లో పుష్కలమైన పోషకాలు..
డయాబెటిక్ రోగులకు ఔషధం..!

వర్షాకాలంలో రుచికి, ఆరోగ్యానికి రెండింటికీ మేలు చేసే కొన్ని విషయాలు ఉన్నాయి. వీటిలో ఒకటి జామున్, దీనిని ఇండియన్ బ్లాక్‌బెర్రీ లేదా బ్లాక్ ప్లం అంటారు. ఈ పండును వర్షాకాలంలో తప్పనిసరిగా తినాలి. చాలా మంది దాని పుల్లని, ఆస్ట్రిజెంట్ లేదా చప్పగా ఉండే రుచిని ఇష్టపడరు. కానీ ఈ బెర్రీలు తీపిగా కూడా ఉంటాయి. ముఖ్యంగా డయాబెటిక్ పేషెంట్లు బ్లాక్బెర్రీస్ తప్పనిసరిగా తినాలి. బ్లాక్బెర్రీస్ తినడం వల్ల కలిగే ప్రయోజనాలను ఇప్పుడు తెలుసుకుందాము. జామూన్‌లో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. జామున్ ఇనుము, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలకు గొప్ప మూలం. కావున , బ్లాక్‌బెర్రీస్ తినడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరుగుతుంది. జామున్‌లో ఫ్లేవనాయిడ్‌లు, ఆంథోసైనిన్‌లు, ఫినోలిక్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లుగా పని చేస్తాయి. ఇది క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షిస్తుంది. అంతేకాదు గుండె జబ్బులు , మధుమేహం వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. జామున్‌లో జంబోలన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది పిండి పదార్థాన్ని చక్కెరగా మార్చే ప్రక్రియను నెమ్మదిస్తుంది. దీని వల్ల డయాబెటిక్ పేషెంట్లకు ఇది చాలా మేలు చేస్తుందని చెబుతారు నిపుణులు. బ్లాక్బెర్రీస్ రక్తంలో చక్కెర స్థాయిని, ఇన్సులిన్ సెన్సిటివిటీని నిర్వహించడంలో సహాయపడతాయి. ఇది కాకుండా, జీర్ణశక్తి తక్కువగా ఉన్నవారు కూడా ప్రతిరోజూ బ్లాక్బెర్రీస్ తినాలి. ఇవి ఆహారాన్ని జీర్ణం చేసే ఎంజైమ్‌లను పెంచి మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. జామూన్ లోని ఆస్ట్రింజెంట్ రుచి చిగుళ్ళలో బ్యాక్టీరియా వృద్ధిని నిరోధిస్తుంది. అలాగే చిగుళ్ళ వాపును తగ్గిస్తుంది. నోటిపూత, నోటి దుర్వాసన వంటి సమస్యలలో కూడా జామున్ చాలా మేలు చేస్తుంది. వర్షాల సమయంలో చర్మం పొడిబారడం, మొటిమలు వంటి సమస్య ఉన్నవారు బెర్రీలు తినాలి. ఇది రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అలాగే చర్మ బ్యాక్టీరియాను తొలగిస్తుంది.

డయాబెటిస్ ఉందా? రైస్ తినాలా వద్దా?

డయాబెటిస్ ఉంటే అన్నానికి కాస్త దూరంగా ఉండాలి అంటారు నిపుణులు. తెలుగు ప్రజలకు అన్నం తినడం అంటేనే ఇష్టం. అలాంటిది పూర్తిగా అన్నం మానేయమంటే మానేస్తారా? మరి అన్నం విషయంలో వైద్యులు ఏమంటున్నారో తెలుసా? డయాబెటిస్ ఉన్నవారు పూర్తిగా అన్నం తినడం మానేయాల్సిన అవసరం లేదంటున్నారు. డైలీ డైట్‌లో అన్నాన్ని చేర్చుకోవచ్చని.. కానీ క్రమ పద్ధతిలో తినాలి అంటున్నారు డైటీషియన్ లు. కేవలం రోజుకు ఒకసారి 30-40 గ్రాముల బియ్యం తీసుకోవాలి అని.. దీని వల్ల బరువు కూడా కం

అగ్ర స్థానంలో కొనసాగుతున్న జియో.. కొత్తగా 2.71 మిలియన్ల చందాదారుల చేరిక



దేశంలో మొబైల్ యూజర్ల సంఖ్య పెరిగింది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2026 సెప్టెంబర్‌లో భారతదేశంలో 6.57 మిలియన్ల కొత్త మొబైల్ చందాదారులు చేరారు. దీంతో మొత్తం మొబైల్ చందాదారుల సంఖ్య 1.3 బిలియన్లకు చేరుకుంది. ఈ నెలలో కొత్తగా చేరిన వారిలో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ వాటానే 5.3 మిలియన్లకు పైగా ఉంది. ఆగస్టు చివరి నాటికి 1,293.43 మిలియన్లుగా ఉన్న వైర్‌లెస్ మొబైల్ చందాదారుల సంఖ్య, సెప్టెంబర్ చివరి నాటికి 1,300 మిలియన్లకు పెరిగిందని, అంటే నెలవారీ వృద్ధి రేటు 0.51 శాతంగా నమోదైందని ఈ గణాంకాలు వెల్లడించాయి. గణాంకాల ప్రకారం, 2026 సెప్టెంబర్‌లో అత్యధికంగా రిలయన్స్ జియో 2.71 మిలియన్ల కొత్త చందాదారులను చేర్చుకోగా, భారతీ ఎయిర్‌టెల్ 2.69 మిలియన్ల మందిని చేర్చుకుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన దీూచీూ 6.26 లక్షల మందిని, వొడాఫోన్ ఐడియా 5.50 లక్షల మందిని కొత్తగా చేర్చుకున్నాయి. అదే సమయంలో మీచీూ 6,628 మంది చందాదారులను కోల్పోయింది. మొత్తంమీద సెప్టెంబర్ నెలలో భారతదేశంలోని టెలికాం ఆపరేటర్లు దాదాపు 6.57 మిలియన్ల వైర్‌లెస్ మొబైల్ చందాదారులను అదనంగా పొందాయి. పట్టణ ప్రాంతాల్లో వైర్‌లెస్ (మొబైల్) చందాదారుల సంఖ్య ఆగస్టు చివరి నాటికి 748.84 మిలియన్ల నుంచి సెప్టెంబర్ చివరి నాటికి 753.85 మిలియన్లకు పెరిగిందని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 544.58 మిలియన్ల నుంచి 546.14 మిలియన్లకు పెరిగిందని ట్రాయ్ పేర్కొంది. రికార్డు సృష్టించిన జియో ఐపీఓ.. షేర్లు వచ్చిన వారికి పండగే..! మొబైల్ కనెక్షన్లు, ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ సేవలను కలిపిన మొత్తం వైర్‌లెస్ చందాదారుల సంఖ్య ఆగస్టులోని 1,312.25 మిలియన్ల నుంచి సెప్టెంబర్‌లో 1,319.19 మిలియన్లకు పెరిగింది. అంటే, ఈ నెలలో మొత్తం 6.94 మిలియన్ల కొత్త చందాదారులు చేరారు. పట్టణ ప్రాంతాల్లో మొబైల్ చందాదారుల నెలవారీ వృద్ధి రేటు 0.67 శాతంగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇది 0.29 శాతంగా నమోదైంది. భారతదేశంలో మొత్తం టెలిఫోన్ చందాదారుల సంఖ్య (వైర్‌లెస్, వైర్‌లైన్ కనెక్షన్‌లతో కలిపి) ఆగస్టులో 1,360.70 మిలియన్ల నుంచి సెప్టెంబర్‌లో 1,367.93 మిలియన్లకు పెరిగింది. కొత్తగా 7.23 మిలియన్ల మంది చందాదారులు చేరడంతో నెలవారీ వృద్ధి రేటు 0.53 శాతంగా నమోదైంది. అలాగే బ్రాడ్‌బ్యాండ్ చందాదారుల సంఖ్య ఆగస్టులో 1,101.21 మిలియన్ల నుంచి సెప్టెంబర్‌లో 1,107.68 మిలియన్లకు పెరిగి, 0.59 శాతం నెలవారీ వృద్ధిని నమోదు చేసింది. మరోవైపు సెప్టెంబర్ నెలలో 16.77 మిలియన్ల మంది చందాదారులు 'మొబైల్ నంబర్ పోర్టబిలిటీ' కోసం దరఖాస్తు చేసుకున్నారు. అంటే, వీరు తమ పాత ఫోన్ నంబర్‌ను అలాగే ఉంచుకుంటూ మొబైల్ సర్వీస్ ప్రొవైడర్‌ను మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు. సెప్టెంబర్‌లో యాక్టివ్ వైర్‌లెస్ మొబైల్ చందాదారుల సంఖ్య 1,212.80 మిలియన్లుగా ఉంది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

కిలో రూ.150కి చేరిన బాస్మతి బియ్యం.. బిర్యానీ రేట్లు పెంచనున్న రెస్టారెంట్లు..!



దేశంలో సన్న బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. మంచి రకం సన్న బియ్యం ధర కిలో రూ.80 నుంచి రూ.90 పలుకుతున్నాయి. ఎల్ నినో వస్తుందన్న నేపథ్యంలో దిగుబడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అయితే సన్న బియ్యమే రూ.90 పలుకుతుంటే.. బిర్యానీకి వాడే బాస్మతి బియ్యం ధరలు కూడా భారీగానే పలుకుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్ బాస్మతి బియ్యం ధ రూ.130 నుంచి రూ.150 పలుకుతున్నాయి. దీంతో బాస్మతి వడ్ల ధర కూడా భారీగానే పెరిగింది. బాస్మతి ఎక్కువగా పండించే రాష్ట్రాలలో బాసుమతి క్వింటాల్ ధర 5 వేల రూపాయలు దాటింది. ఏడాది క్రితం 4 రూపాయలు ఉన్న ధర ఒక్కసారిగా పెరగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. బాస్మతి వరి వెరైటీలు అయిన 1509, 1121 ధరలు హర్యానాలోని కర్నాల్, పంజాబ్ లోని ఖన్నా మార్కెట్లలో క్వింటా ధర 4 వేల 500 నుంచి 5 వేల 200 రూపాయలు పలుకుతోంది. గత ఏడాదితో పోల్చితే కనీసం వెయ్యి రూపాయలు పెరిగినట్లు వివరిస్తున్నారు. మన దేశంలో 75 శాతం రకాలే వాడుతున్నట్లు చెబుతున్నారు. కాగా బాస్మతి బియ్యానికి దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా భారీగా డిమాండ్ ఉంది. గల్ఫ్ దేశాలలో డిమాండ్ కారణంగానే ఎక్కువ ధరలు పెరిగినట్లు వ్యాపారులు వివరిస్తున్నారు. కిలో బియ్యం రూ.95.. ఇక సన్న బియ్యం దొరకడం కష్టమే..! ముఖ్యంగా సౌదీ అరేబియా, యూఏఈలో ఎక్కవ డిమాండ్ ఉన్నట్లు పేర్కొంటున్నారు. గల్ఫ్ లో యుద్ధం కారణంగా ఈ దేశాలు ఎక్కువ శాతం నిలువలను పెంచుకునేందుకు భారీ మొత్తంలో దిగుమతి చేసుకుంటున్నాయని ఆలిండియా రైస్ ఎక్స్పోర్ట్స్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ రంజిత్ సింగ్ జాసన్ చెప్పారు. 2026 ఆర్థిక సంవత్సరంలో భారత్ 6 మిలియన్ల 52 వేల టన్నుల బాస్మతి రైస్ ను ఎగమతి చేసింది. దీని విలువ దాదాపు 54 వేల కోట్ల రూపాయలుగా ఉన్నట్లు అంచనా. బియ్యం ధరలు పెరగడం వల్ల రెస్టారెంట్లలో బిర్యానీ ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. బాస్మతి బియ్యం ధరలు పెరగడం, ఉల్లి ధరలు పెరగడం, అల్లం, వెల్లుల్లి ధరలు పెరగడంతో హోటల్ యాజమాన్యాలు కూడా ధరలు పెంచక తప్పడం లేదంటున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

నవంబర్ 1 నుంచి కొత్త నిబంధనలు.. రీఫండ్స్, రిటర్న్ ఫైలింగ్, లో కీలక మార్పులు..



దేశంలో వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) నిబంధనలను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సయోధ్యను మెరుగుపరచడం, పన్ను రీఫండ్‌ల ప్రక్రియను వేగవంతం చేయడమే లక్ష్యంగా జీఎస్టీ కౌన్సిల్ పలు విప్లవాత్మక నిబంధనల పాటింపు సంస్కరణలను సిఫార్సు చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ సభ్యుడు సంజయ్ మంగళ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ సంస్కరణలు రెండు దశల్లో అమలు కానున్నాయి. శాసన సవరణలు అవసరం లేని చర్యలు నవంబర్ 1, 2026 నుండి అమల్లోకి రానుండగా, కీలక చట్టపరమైన మార్పులను ఏప్రిల్ 1, 2027 నాటికి అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత అక్టోబర్ 8న జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించిం కుప్పకూలుతున్న బంగారం ధరలు.. తులానికి రూ.38,600 తగ్గిన పసిడి.. ! పన్ను చెల్లింపుదారులు, వ్యాపారాలు తెలుసుకోవాల్సిన ప్రధాన నిర్ణయాలివే: 1. జీఎస్టీ రిటర్న్ ఫారాల సవరణ దాదాపు 80 శాతం జీఎస్టీ నోటీసులు రిటర్న్‌లలోని డేటా వ్యత్యాసాల వల్లనే వస్తున్నాయని సీబీఐసీ తెలిపింది. దీనిని నివారించేందుకు మరియు ఫారాలను సవరించనున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కోసం నవంబర్ 1 నుండి నవంబర్ 30 వరకు ఇవి ఎ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. సవరించిన ఈ కొత్త ఫారాలు ఏప్రిల్ 1, 2027 నుండి అమలులోకి వస్తాయి. 2. చిన్న వ్యాపారులకు పథకం ఆలస్య రుసుము మాఫీ రైతులకు గుడ్ న్యూస్.. ఆ తేదీనే అన్నదాతల ఖాతాల్లోకి రూ.6 వేలు జమ..! ఏడాదికి ?5 కోట్ల వరకు టర్నోవర్ ఉండి, నమోదిత వినియోగదారులకు కాకుండా కేవలం అన్‌రిజిస్టర్డ్ వినియోగదారులకు (2) మాత్రమే వ్యాపారం చేసే చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం 'ఆప్షనల్ యాన్యువల్ రిటర్న్ క్వార్టర్లీ పేమెంట్' పథకాన్ని ఆమోదించారు. వీరు ఏటా ఒకసారి రిటర్న్ దాఖలు చేసి, పన్నును త్రైమాసిక ప్రాతిపదికన చెల్లించవచ్చు. అలాగే రూ. 5 కోట్ల లోపు టర్నోవర్ ఉన్న పన్ను చెల్లింపుదారులు గడువు ముగిసే నెల చివరి నాటికి ఆలస్యంగా రిటర్న్ ఫైల్ చేస్తే ఆలస్య రుసుములను మాఫీ చేయాలని కౌన్సిల్ సిఫార్సు చేసింది. 3. రీఫండ్లు ఐటీసీ ఉపశమనం: నవంబర్ 1, 2026 లేదా ఆ తర్వాత దాఖలయ్యే అర్హత కలిగిన భవిష్యత్ జీఎస్టీ రీఫండ్‌ల ఆటోమేటెడ్ మంజూరు ప్రారంభమవుతుంది. రీఫండ్ రసీదులు లేదా లోప మెమోలను జారీ చేసే గడువును 15 రోజుల నుండి 10 రోజులకు తగ్గించారు. జీరో-రేటెడ్ సరఫరాలు మరియు ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ కింద క్లెయిమ్‌లకు ఆటోమేటెడ్ రిస్క్-ఆధారిత విధానం ద్వారా 90 శాతం తాత్కాలిక రీఫండ్ లభిస్తుంది.బెంగళూరు వాసులకు గుడ్ న్యూస్.. నవంబర్ 1న వందే భారత్ స్లీపర్ ట్రైన్ ప్రారంభం..! 4. ఇ-కామర్స్ విక్రేతలకు రిజిస్ట్రేషన్ల సడలింపు: ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విక్రయాలు జరిపే చిన్న వ్యాపారులు తమకు భౌతిక కార్యాలయం లేని ఇతర రాష్ట్రాల్లో ప్లాట్‌ఫారమ్ గిడ్డంగులను తమ ప్రధాన వ్యాపార స్థలంగా ప్రకటించుకోవచ్చు. అయితే ఈ వెసులుబాటులో నమోదిత కొనుగోలుదారులకు అందించే ఐటీసీపై నెలకు రూ. 2.5 లక్షల పరిమితి ఉంటుంది. 5. జీఎస్టీ అరెస్టు నిబంధనలు ప్రాసిక్యూషన్ పరిమితి పెంపు: ఏప్రిల్ 1, 2027 నుండి జీఎస్టీ అరెస్టు అధికారాలలో కొన్ని సవరణలు చేయనున్నారు. ప్రాసిక్యూషన్ పరిమితిని ప్రస్తుత రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచనున్నారు. అలాగే షో-కాజ్ నోటీసులు జారీ చేయడానికి కనీసం రూ. 10,000 థ్రెషోల్డ్ లిమిట్ విధించాలని కౌన్సిల్ నిర్ణయించింది. విస్తృత స్థాయి రేట్ల హేతుబద్ధీకరణ (ఝఞ =ఫ్‌వ =ఫ్‌అశీఝశ్రీఅఫ్‌అశీఅ) కంటే నియమపాలనను మరింత సరళతరం చేయడంపైనే 57వ జీఎస్టీ కౌన్సిల్ ప్రధానంగా దృష్టి సారించింది. నోటిఫికేషన్లు వెలువడిన తర్వాత వ్యాపారాలు ఈ మార్పులను అమలు చేయాల్సి ఉంటుంది.

ఆ ప్రకటనతో దూసుకెళ్లిన రక్షణ రంగ స్టాక్స్..!



రక్షణ సేకరణ మండలి (డీఏసీ) దాదాపు రూ.2.12 లక్షల కోట్ల విలువైన డిఫెన్స్ పరికరాల సేకరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతో మంగళవారం నాడు రక్షణ రంగ స్టాక్‌లు 9% వరకు పుంజుకున్నాయి. రూ.2.12 లక్షల కోట్ల విలువైన ఆర్డర్స్ లో 82 శాతం భారత పరిశ్రమకే కేటాయించబడటంతో, ఈ అనుమతులు దేశీయ రక్షణ తయారీ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న నిరంతర ప్రోత్సాహాన్ని కూడా స్పష్టం చేశాయి. దీంతో అపోలో మైక్రో సిస్టమ్స్ 8.7% పెరిగింది. డేటా ప్యాటర్న్స్ 8.1%, పారస్ డిఫెన్స్ 7.3%, ఆస్ట్రా మైక్రో సిస్టమ్స్ 5.9% పెరిగాయి. ఎమ్ టార్ టెక్నాలజీస్ తన 5శాతం అప్పర్ సర్క్యూట్ ను తాకింది. మిధాని, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ (హెచ్ఏఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), బీఈఎంఎల్ మరియు మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ 3-4% మేర పెరిగాయి.గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 45 సాతం ఆదాయ వృద్ధి ఉన్నప్పటికీ, 27 రెండవ త్రైమాసికంలో రూ.20.6 కోట్ల నికర నష్టాన్ని (52.2 కోట్లు) నివేదించిన తర్వాత, ఏక్వస్ 19% క్షీణించి మినహాయింపుగా నిలిచింది. మొబిలిటీ, నిఘా, వాయు రక్షణ, కచ్చితమైన దాడులు, డ్రోన్ వ్యతిరేక యుద్ధం వంటి విస్తృత శ్రేణి సైనిక పరికరాలకు డిఫెన్స్ అక్విజిషన్ కమిషన్ ఆమోదం తెలిపింది. భారత సైన్యం కోసం హై మొబిలిటీ వెహికల్స్, సెల్ఫ్-ప్రొపెల్డ్ ట్రాక్డ్ గన్ సిస్టమ్స్, గన్ షాట్ రెస్పాన్స్ సిస్టమ్స్, లైట్ మల్టీ రోల్ హెలికాప్టర్లు వెరీ షార్ట్-రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ , ప్లాట్‌ఫామ్-బేస్డ్ కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ ఉన్నాయి. ఈ జాబితాలో సుదూర మానవరహిత వైమానిక వ్యవస్థలు, నిఘా ఖూఎలు, ఇంటిగ్రేటెడ్ సర్వైలెన్స్ అండ్ స్ట్రైక్ సిస్టమ్, లాంగ్ రేంజ్ కమికాజీ డ్రోన్ సిస్టమ్స్ కూడా ఉన్నాయి.బంగారం ధర రూ. 2 లక్షలకు.. సిల్వర్ రూ. 4 లక్షలకు వెళ్లడం ఖాయం.. బులియన్ నిపుణులు తాజా అంచనాలివిగో.. భారత వైమానిక దళం హెలికాప్టర్లు, వాయు రక్షణ వ్యవస్థలు, ఆయుధాలు, మొబైల్ ఎక్స్-బ్యాండ్ డాప్లర్ వాతావరణ రాడార్ వ్యవస్థల కోసం అనుమతులు పొందింది. ప్రత్యేక యుటిలిటీ హెలికాప్టర్లు వాయు రవాణా అవసరాలను తీర్చడానికి ఉపయోగపడనున్నాయి. కాగా వాతావరణ రాడార్లు ముందు వరుస ప్రాంతాలలో అధిక రిజల్యూషన్‌తో కూడిన స్థానిక నిఘాకు మద్దతు ఇస్తాయి. భారత నౌకాదళం కోసం నౌకా విధ్వంసక క్షిపణుల నుంచి రక్షణను బలోపేతం చేస్తాయని భావిస్తున్న యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్స్ తో పాటు, స్వదేశీంగా రూపొందించి, నిర్మించనున్న ఇతర నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌లకు కూడా ఈ ఆమోదాలు లభించాయి. యాంటిక్ స్టాక్ బ్రోకింగ్ ఈ రంగంపై సానుకూల దృక్పథాన్ని కొనసాగిస్తూ ఈ తాజా అనుమతులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ రక్షణ సంస్థల మధ్యకాలిక సేకరణల మార్గాన్ని బలోపేతం చేశాయని పేర్కొంది. ఇది హెచ్ఏఎల్ బీఈఎల్ లకు కలిసివచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. యాంటిక్, హెచ్ఏఎల్, బీఈఎల్, సోలార్ ఇండస్ట్రీస్, ఆస్ట్రా మైక్రోవేవ్ మరియు కృష్ణ డిఫెన్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్‌పై 'కొనుగోలు' రేటింగ్‌లను ఇచ్చింది. అయితే, ఏఓఎన్ ఆమోదాలను కాంట్రాక్టులుగా వేగంగా మార్చడం, భారీ ప్రొక్యూర్‌మెంట్ పైప్‌లైన్‌ను అమలు చేయగల ఆర్డర్లుగా మార్చడంపైనే స్థిరమైన ఆదాయ వృద్ధి ఆధారపడి ఉంటుందని బ్రోకరేజ్ హెచ్చరించింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

టీ20 క్రికెట్‌లో భారత పేసర్ వరల్డ్ రికార్డు.. సరికొత్త చరిత్ర సృష్టించిన అర్ష్‌దీప్ సింగ్



టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఐర్లాండ్‌కు చెందిన జాషువా లిటిల్ రికార్డును సమం చేశాడు. నిన్న వెల్లింగ్‌టన్‌లోని హెన్రీ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు.ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ ఒక వికెట్ పడగొట్టాడు. దీంతో 2026 క్యాలెండర్ ఏడాదిలో అతను తీసిన మొత్తం వికెట్ల సంఖ్య 39కి చేరింది. 2022లో ఐర్లాండ్ పేసర్ జాషువా లిటిల్ కూడా ఒకే ఏడాదిలో 39 వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు. ఇప్పుడు అర్ష్‌దీప్ ఆ రికార్డును సమం చేసి, పూర్తిస్థాయి సభ్యత్వం ఉన్న దేశాల బౌలర్లలో అగ్రస్థానంలో నిలిచాడు. 2022లో అంతర్జాతీయ అరంగేట్రం చేసినప్పటి నుంచి అర్ష్‌దీప్ సింగ్ భారత బౌలింగ్ దళంలో కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు 102 టీ20 మ్యాచ్‌లు ఆడి 149 వికెట్లు పడగొట్టాడు. మరో వికెట్ తీస్తే 150 వికెట్ల మైలురాయిని అందుకుంటాడు. టీ20 ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కూడా అర్ష్‌దీప్ కొనసాగుతున్నాడు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో మూడు మ్యాచ్‌లలో కలిపి 4 వికెట్లు తీశాడు.

'170 కష్టమన్నాడు'.. భారత్ ఊచకోత.. చోప్రాపై ట్రోల్స్ వర్షం

భారత్-కివీస్ మ్యాచ్‌పై బెడిసికొట్టిన ఆకాశ్ చోప్రా జోస్యం

170 పరుగులే కష్టమంటూ ట్వీట్

199 పరుగుల లక్ష్యాన్ని ఊదేసిన భారత్

సోషల్ మీడియాలో చోప్రాపై విపరీతంగా ట్రోలింగ్



భారత మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోలింగ్‌కు గురయ్యాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో అతడు చెప్పిన జోస్యం బెడిసికొట్టడమే ఇందుకు కారణం. ఈ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించగా, చోప్రా అంచనా మాత్రం దారుణంగా విఫలమైంది.మంగళవారం వెల్లింగ్‌టన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 3 వికెట్లకు 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్యఛేదనపై ఆకాశ్ చోప్రా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "ఈ రోజు 170కి పైగా పరుగుల ఛేదన చాలా కష్టంగా కనిపిస్తోంది" అని పోస్ట్ చేశాడు. అయితే, భారత జట్టు కేవలం 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 199 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి సంచలనం సృష్టించింది. అభిషేక్ శర్మ (38 బంతుల్లో 113), వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) మెరుపు ఇన్నింగ్స్‌లతో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది.భారత ఓపెనర్లు కివీస్ బౌలింగ్‌ను ఊచకోత కోయడంతో, నెటిజన్లు చోప్రాపై విమర్శల వర్షం కురిపించారు. ఆయన అంచనాను ఎగతాళి చేస్తూ పెద్ద ఎత్తున మీమ్స్, కామెంట్లతో ట్రోల్ చేశారు.ఈ ట్రోలింగ్‌పై ఆకాశ్ చోప్రా ఒక వీడియోలో స్పందించాడు. "ప్రజలు ట్విట్టర్‌కు దూరంగా ఉండాలని నేను భావిస్తున్నాను. ఎందుకంటే అది మనందరిలో ఉన్న చెత్తను బయటకు తెస్తుంది" అని వ్యాఖ్యానించాడు. తాను 10 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించడం కష్టమనే ఉద్దేశంతో ఆ ట్వీట్ చేశానని, పిచ్‌పై బంతి కదులుతుండటంతో అలా అనిపించిందని వివరణ ఇచ్చాడు. అయితే, భారత బ్యాటర్లు పరిస్థితులను తేలికగా మార్చేసి అద్భుతంగా ఆడారని ప్రశంసించాడు.

వాళ్ల బ్యాటింగ్ చూసి కళ్లు చెదిరాయి: భారత ఓపెనర్లపై శ్రేయస్ ప్రశంసలు

కివీస్‌తో మూడో టీ20లో అభిషేక్ శర్మ విధ్వంసం

38 బంతుల్లో 113 పరుగులు చేసిన ఓపెనర్

15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీతో కలిసి రికార్డు భాగస్వామ్యం

టీ20 సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న భారత్

పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి సరికొత్త చరిత్ర సృష్టించిన టీమిండియా



న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ప్రదర్శన 'మైండ్‌బ్లోయింగ్' అని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రశంసించాడు. వాళ్లిద్దరూ ఆడిన షాట్లు కళ్లకు పండుగ చేశాయని, తాను, సంజూ బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు బంతి సీమ్ అవుతుంటే.. వీళ్లు ఇంత సులభంగా ఎలా ఆడగలిగారని ఆశ్చర్యపోయానని అయ్యర్ వ్యాఖ్యానించాడు. అంతర్జాతీయ స్థాయిలో ఐదు ఓవర్లలోనే 100 పరుగులు చేయడం తాను ఎప్పుడూ చూడలేదని, ఇది అద్భుతమని కొనియాడాడు.వెల్లింగ్‌టన్‌లో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 38 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్సర్లతో 113 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతడికి తోడుగా 15 ఏళ్ల యువ కెరటం వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో 45 పరుగులు చేశాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 7.1 ఓవర్లలో 133 పరుగులు జోడించారు. పవర్‌ప్లేలో భారత్ వికెట్ నష్టపోకుండా 118 పరుగులు చేసి టీ20 చరిత్రలో సరికొత్త రికార్డు నెలకొల్పింది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్, డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (40) రాణించడంతో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఈ విజయంతో భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0తో కైవసం చేసుకుంది. అద్భుత శతకం చేసిన అభిషేక్ శర్మకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. నాలుగో టీ20 శుక్రవారం ఆక్లాండ్‌లో జరగనుంది.



రవిబాబు హారర్ సినిమాలో కంగనా రనౌత్

నావిధ్యమైన కథలు, విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు రవిబాబు మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల క్రైమ్ థ్రిల్లర్ 'రేజర్'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన.. ఇప్పుడు హారర్ కథాంశంతో సినిమా తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించబోతున్నారనే వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ముందస్తు పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా జరుగుతోందని కొన్ని కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. కంగనా నిజంగానే ఈ సినిమాలో నటిస్తున్నారా? ఒకవేళ నటిస్తే ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.కంగనా రనౌత్ వంటి బాలీవుడ్ స్టార్.. రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమాలో నటించబోతున్నారనే ప్రచారం నిజమైతే ఈ ప్రాజెక్టుపై అంచనాలు పెరిగే అవకాశం ఉంది. కంగనా రనౌత్ గతంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'ఏక్ నిరంజన్' సినిమాలో హీరోయిన్‌గా కనిపించారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ద్వారా ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అదే ఆమె నటించిన ఏకైక తెలుగు చిత్రంగా ఇప్పటివరకు గుర్తింపు పొందింది. ఇప్పుడు రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమా చేస్తున్నారనే ప్రచారం నిజమైతే.. దాదాపు 17 ఏళ్ల తర్వాత ఆమె మరోసారి తెలుగు సినిమాలో కనిపించే అవకాశం ఉంటుంది. దీంతో ఈ వార్తపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.మరోవైపు కంగనా రనౌత్ ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'క్వీన్ 2', 'సర్కిల్', 'తను వెడ్స్ మను 3' వంటి ప్రాజెక్టులకు సంబంధించి వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తెలుగు సినిమా చేయబోతున్నారనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ సినిమాలో కంగనా నటిస్తున్నారా? చిత్రీకరణ నిజంగానే ప్రారంభమైందా? అనే అంశాలపై ఆమె బృందం లేదా చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతానికి రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమాలో కంగనా నటిస్తున్నారనే వార్తలు ప్రచారంగానే పరిగణించాలి.

ప్రభాస్ 'ఫౌజీ'కి చిక్కులు.. నేతాజీ చరిత్రను వక్రీకరించారంటూ దర్శకుడిపై విమర్శలు!



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఫౌజీ' మట్టా మినాదం మొదలైనట్లు వార్తలు వస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చరిత్రకు సంబంధించిన అంశాలను సినిమాలో వక్రీకరించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ విషయంపై నేతాజీ మనవడు, అయన కుటుంబానికి చెందిన చంద్రకుమార్ బోస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. చరిత్రను తప్పుగా చూపించినందుకు చిత్ర దర్శకుడు భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని అయన డిమాండ్ చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితానికి సంబంధించిన అంశాలను చిత్రాల్లో చూపించే విషయంలో దర్శకులు జాగ్రత్తగా వ్యవహరించాలని చంద్రకుమార్ బోస్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నేతాజీ, జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్‌తో సమావేశమైన సందర్భాన్ని సినిమాలో తప్పుగా చిత్రీకరించారనే ఆరోపణలు అయన చేశారు. స్వాతంత్ర్య పోరాటం, దానికి నాయకత్వం వహించిన ప్రముఖుల గురించి సినిమాలు తీయడానికి చిత్రనిర్మాతలకు స్వేచ్ఛ ఉంది కాని, సృజనాత్మక స్వేచ్ఛ పేరుతో చారిత్రక వాస్తవాలను వక్రీకరించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ నాయకుల గురించి సినిమాలు తీసేటప్పుడు వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రకుమార్ బోస్ వ్యాఖ్యానించారు. చారిత్రక అంశాలను తప్పుగా చూపిస్తూ కల్పిత కథనాలను తోడించడం నేరంతో సమానమని అయన అభిప్రాయపడ్డారు. నేతాజీ బిట్లర్‌తో ఎదిపిన భేటీకి సంబంధించిన అంశాలను వక్రీకరించడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుని ఎక్కడని తగ్గించినట్లుగా సినిమా ఉండని అయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో 'ఫౌజీ' దర్శకుడు భారత ప్రజలకు, దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని గౌరవించే ఎవరికైనా క్షమాపణ చెప్పాలని అయన డిమాండ్ చేశారు. ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ'పై వచ్చిన ఈ ఆరోపణలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే చంద్రకుమార్ బోస్ చేసిన ఆరోపణలకు సంబంధించి చిత్రబృందం అధికారికంగా స్పందిస్తుందా, సినిమాలో నేతాజీకి సంబంధించిన సన్నివేశాలను ఏ విధంగా చిత్రీకరించారు? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వివాదానికి సంబంధించి ఆరోపణలు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. చిత్రబృందం వివరణ లేదా సినిమాలోని సంబంధిత సన్నివేశాలపై పూర్తి సమాచారం అందుబాటులోకి వచ్చిన తర్వాతే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వరుస పాన్ ఇండియా సినిమాలతో గోపీచంద్ కమ్‌బ్యాక్..



టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ వరుస పరాజయాల నుంచి బయటపడి సాలిడ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని పట్టుదలతో ఉన్నారు. గతంలో తనకు విజయాలు అందించిన తడవో కథలతో పరిమితం కాకుండా, కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు ప్రతిష్టాత్మక ఎంటర్‌టైనర్లు ఉన్నాయి. ఈ సినిమాలతోనైనా బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని గోపీచంద్ ప్రయత్నిస్తున్నారు. గోపీచంద్ నటిస్తున్న చిత్రాల్లో 'భరతనవర్ష' ఒకటి. సంతోష్ రెడ్డి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించింది. ఇటీవల విడుదల చేసిన 'అమ్మ కదిలి వచ్చే' పాటతో సినిమా సంగీత ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాపై గోపీచంద్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. గత చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఆయన కెరీర్‌కు ఎలాంటి మలుపు తీసుకొస్తుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు గోపీచంద్ 'సింగా' అనే పాన్ ఇండియా చిత్రంలోనూ నటిస్తున్నారు. ఈ సినిమాతో స్టంట్ కొరియోగ్రాఫర్ వంశీ మాస్టర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే సగానికిపైగా పూర్తయినట్లు తెలుస్తోంది.ఈ సినిమాకు సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. కాగా విడుదలైన పోస్టర్ గోపీచంద్ పాత్రపై ఆసక్తిని పెంచింది. పూరీ జగన్నాథ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఆయన లెవల్‌లో మరో కీలక ప్రాజెక్టుగా నిలవనుంది. ప్రస్తుతం 'భరతనవర్ష', 'సింగా' చిత్రాలతో బిజీగా ఉన్న గోపీచంద్.. విడుదల తేదీల విషయంలో మాత్రం తొందరపడటం లేదని తెలుస్తోంది. ఒక సినిమా షూటింగ్ పూర్తవగా, మరో సినిమా సగానికిపైగా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఈ రెండు సినిమాల విడుదల తేదీలను ప్రకటించలేదు. చిత్రీకరణ, నిర్మాణానంతర పనులు, ఇతర ఏర్పాట్లు పూర్తిగా సిద్ధమైన తర్వాతే విడుదల తేదీని ప్రకటించాలని చిత్ర బృందాలు భావిస్తున్నట్లు సమాచారం. ముందుగానే తేదీ ప్రకటించి, చివరి నిమిషంలో వాయిదా వేయాల్సిన పరిస్థితి రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. గోపీచంద్ గత కొంతకాలంగా అందిన విజయాలను అందుకోలేకపోతున్నారు. దీంతో ఈసారి కథల ఎంపికలో కొత్తదనానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది.

జైలర్ 2 బాక్సాఫీస్ సునామీ..



సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారని ట్రేడ్ వర్గాల గణాంకాలు చెబుతున్నాయి. నెల్సన్ దిలీపికుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన మొదటి వారంలోనే మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించినట్లు సమాచారం. ట్రేడ్ అంచనాల ప్రకారం, కేవలం 11 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.700 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటింది. దీంతో రజనీకాంత్ అభిమానుల్లో ఈ సినిమాపై ఉన్నాహాల మరింత పెరిగింది. సాధారణంగా భారీ అంచనాలతో విడుదలైన సినిమాలకు తొలి ఎదురుదెబ్బతో చాలా మంది మనుషులు వచ్చినప్పటికీ, ఆ తర్వాత కలెక్షన్లు తగ్గడముతో సహజం అయిపోతుంది. అయితే 'జైలర్ 2' విషయంలో రెండో వారాంతంలోనూ వసూళ్ల జోరు కొనసాగినట్లు ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రెండో ఆదివారం సినిమా కలెక్షన్లు పెరిగినట్లు సమాచారం. ఆ ఒక్క రోజే దేశవ్యాప్తంగా సుమారు రూ.25.70 కోట్ల నికర వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ గణాంకాలు పేర్కొంటున్నాయి. రెండో వారాంతంలోని మూడు రోజుల్లో కలిపి దాదాపు రూ.64.35 కోట్ల నెట్ వసూళ్లు వచ్చినట్లు అంచనా. ట్రేడ్ వర్గాల గణాంకాల ప్రకారం, 'జైలర్ 2' ప్రపంచవ్యాప్త గ్రాస్ వసూళ్లు రూ.710.35 కోట్లకు చేరినట్లు సమాచారం. ఇందులో దేశీయ మార్కెట్ నుంచి సుమారు రూ.466.85 కోట్లు, విదేశీ మార్కెట్ల నుంచి దాదాపు రూ.243.50 కోట్ల గ్రాస్ వచ్చినట్లు అంచనాలు చెబుతున్నాయి. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే రూ.400 కోట్ల నెట్ మార్కును కూడా అందుకునే అవకాశం ఉంది. అయితే ఇవి ట్రేడ్ అంచనాల ఆధారంగా వచ్చిన గణాంకాలు కావడంతో, అధికారిక వసూళ్ల వివరాలతో పోల్చి చూడాల్సి ఉంటుంది.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.